Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 257 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6 అక్టోబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

## ఆంధ్రప్రదేశ్‌లో రాక్షస పాలన...

బెంగళూరు : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ బళ్లారి జిల్లా కురుగోడు పట్టణంలో ప్రవాసాంధ్రులు ర్యాలీ నిర్వహించారు. బాదనహట్టి రోడ్డులోని సాయిబాబా మందిరం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ప్రవాసాంధ్ర ప్రముఖులు శ్రీనివాస్ చక్రవర్తి, మిలటరీ ప్రసాద్‌రావు, రాజేంద్రప్రసాద్, బళ్లారి మాజీ మేయర్ రాజేశ్వరి, కుడితిన్ని శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం వల్ల అక్కడ ప్రతి ఒక్కరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అక్కడ రాక్షసపాలన సాగుతోందని విమర్శించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఏపీ ప్రభుత్వం ఇంత అన్యాయంగా వ్యవహరిస్తున్నా కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

# మరో వినూత్న పథకానికి కేసీఆర్ శ్రీకారం

## ముఖ్యమంత్రి అల్పాహార పథకం మెనూ ఖరారు..

## నేడు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్




హైదరాబాద్ : ప్రజా సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన కేసీఆర్ సర్కారు మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్త ముఖ్యమంత్రి మరో చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. దసరా కానుకగా, అక్టోబర్ 6వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతుల విద్యార్థులకు 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' ప్రారంభం కానుంది. ఈ మేరకు సీఎం బ్రేక్ ఫాస్ట్ మెనూ ఖరారైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాల జడ్పీహెచ్‌ఎస్‌లో ఈ పథకాన్ని శుక్రవారం ఉదయం 8:45 గంటలకు ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 27,147 పాఠశాలల్లో 23 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారు. పాఠశాల ప్రారంభానికి 45 నిమిషాల ముందే అల్పాహారం అందివ్వనున్నారు.

**అల్పాహారం మెనూ ఇదే..** సోమవారం – ఇడ్లీ సాంబార్ లేదా గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ, మంగళవారం – పూరి, ఆలు కుర్మ లేదా టమాటా బాత్ విత్ రవ్వ, చట్నీ, బుధవారం – ఉప్మా, సాంబార్ లేదా కిచిడి, చట్నీ, గురువారం – మిల్లెట్ ఇడ్లీ, సాంబార్ లేదా పొంగల్, సాంబార్, శుక్రవారం – ఉగ్గాని/ పోహా/మిల్లెట్ ఇడ్లీ, చట్నీ లేదా గోధుమ రవ్వ కిచిడీ, చట్నీ, శనివారం – పొంగల్/సాంబార్ లేదా వెజిటబుల్ పొలావ్, రైతా/ఆలు కుర్మ. **ప్రైమరీ స్కూల్ టైమింగ్స్..** ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు ప్రైమరీ స్కూల్స్ పని చేస్తాయి. బ్రేక్ ఫాస్ట్ టైమింగ్స్ – ఉదయం 8:45 గంటల నుంచి, ప్రార్థనా సమయం – 9:35 నుంచి 9:45 వరకు.

**హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని స్కూల్స్ టైమింగ్స్...** ఉదయం 8:45 నుంచి సాయంత్రం 3:45 వరకు పని చేస్తాయి. బ్రేక్ ఫాస్ట్ టైమింగ్స్ – ఉదయం 8 గంటల నుంచి, ప్రార్థనా సమయం – 8:50 నుంచి 9 గంటల వరకు.

**అప్పర్ ప్రైమరీ, హై స్కూల్ స్కూల్ టైమింగ్స్..** ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు ప్రైమరీ స్కూల్స్ పని చేస్తాయి. బ్రేక్ ఫాస్ట్ టైమింగ్స్ – ఉదయం 8:45 గంటల నుంచి, ప్రార్థనా సమయం – 9:35 నుంచి 9:45 వరకు

**హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని స్కూల్స్ టైమింగ్స్..** ఉదయం 8:45 నుంచి సాయంత్రం 4:00 వరకు పని చేస్తాయి. బ్రేక్ ఫాస్ట్ టైమింగ్స్ – ఉదయం 8 గంటల నుంచి, ప్రార్థనా సమయం – 8:50 నుంచి 9 గంటల వరకు.




తలపండిన నేతల నుంచి జెండాలు మోసే కుర్రాళ్ల దాకా ఎవరైనా.. బరిలోకి మాత్రం రేసుగుర్రాలనే దింపుతామంటోంది హస్తం పార్టీ . ప్రత్యర్థులను చిత్తుచేసి, రణరంగంలో విజయభేరి మోగించేలా అభ్యర్థుల ఎంపికకు సుదీర్ఘ కసరత్తులు చేస్తోంది. గెలుపే లక్ష్యంగా అధిష్ఠానం పన్నుతున్న వ్యూహాలతో కాంగ్రెస్‌లో కాకలు తీరిన యోధులకు సైతం టికెట్ టెన్షన్ పట్టుకుంది.

## ఈడీ కసరత్తు




దిల్లీ: మద్యం కుంభకోణం కేసు నిందితుల జాబితాలో ఆమ్ ఆద్మీ పార్టీని చేర్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఆప్ పేరును చేర్చాలా వద్దా అన్న దానిపై ఈడీ విభాగంలో అంతర్గతంగా చర్చలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దీనిపై న్యాయ సలహాలు కూడా తీసుకుంటున్నట్లు సమాచారం. న్యాయవాదుల నుంచి అభిప్రాయాలను పరిశీలించిన తర్వాత ఈడీ దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. మద్యం కుంభకోణంలో ప్రధాన లబ్ధిదారు ఆమ్ ఆద్మీ పార్టీ అయినప్పుడు.. ఆ పేరును నిందితుల జాబితాలో ఎందుకు చేర్చలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించిన నేపథ్యంలో ఈడీ దీనిపై కసరత్తు ప్రారంభించింది. దిల్లీ లిక్కర్ స్కామ్‌లో వివిధ వ్యక్తుల నుంచి అందిన రూ.100 కోట్ల ముడుపులను ఆప్.. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వినియోగించిందని ఈడీ ఆరోపించింది. ఈ ఆరోపణలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. ఈడీకి బుధవారం కీలక ప్రశ్నలు సంధించింది. "మీరు నమోదు చేసిన మనీలాండరింగ్ కేసు ప్రకారం ముడుపుల సొమ్ము మొత్తం ఆ రాజకీయ పార్టీకి వెళ్లాయి. లబ్ధిదారు ఆ పార్టీయే కానీ మనీశ్ సిసోదియా కాదు. మరి ఆ పార్టీ పేరును నిందితుల జాబితాలో ఎందుకు చేర్చ లేదు. దీనికి మీ సమాధానం ఏమిటి?' అని ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజును ధర్మాసనం ప్రశ్నించింది.

దీంతో ఈడీ చర్యలు చేపట్టింది. నిందితుల జాబితాలో ఆప్ పేరును చేర్చేందుకే దర్యాప్తు సంస్థ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని గురువారం సుప్రీంకోర్టుకు తెలపనున్నట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. ఇక, మద్యం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మరో సీనియర్ నేత, ఎంపీ సంజయ్ సింగ్‌ను ఇటీవల ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అప్రూవర్‌గా మారిన నిందితుడు దినేశ్ అరోరా నుంచి సంజయ్‌కు కోట్లాది రూపాయాలు చేరినట్లు ఈడీ ఆరోపించింది. ఇదిలా ఉండగా.. సంజయ్ సింగ్ అరెస్టును వ్యతిరేకిస్తూ దిల్లీలో ఆప్ నేడు ఆందోళనకు దిగింది.

## మోడీ మాటకే పరిమితమైతే కేసీఆర్ ఆచరణలో పెట్టారు




రంగారెడ్డి : రైతు ఆదాయం డబుల్ కావాలంటే నోటి మాటలతో ఊకదంపుడు ఉపన్యాసాలతో కాదు అని ప్రధాని నరేంద్ర మోదీపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతుకు ధీమా ఇచ్చి సరైన ఆలోచన, విధానాలు అమలు చేసినప్పుడే రైతు ఆదాయం డబుల్ అవుతుంది. అందుకే సీఎం కేసీఆర్ పాడిని ప్రోత్సహిస్తున్నారు. పంటను ప్రోత్సహిస్తున్నారు. మినీ డెయిరీలను పెద్ద ఎత్తున ఎంకరేజ్ చేస్తున్నాం అని మంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో తప్ప ఇతర రాష్ట్రాల్లో రైతుల కష్టాలు డబుల్ అయ్యాయి. ఇతర రాష్ట్రాల్లో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంట్ ఇవ్వలేని దుస్థితి నెలకొని ఉందని కేటీఆర్ తెలిపారు.

మోదీ చెప్పినట్టు రైతుల ఆదాయం డబుల్ అయినా, కాకపోయినా.. తెలంగాణలో మాత్రం కేసీఆర్ నాయకత్వంలో పాడి రైతులకు గానీ, ఇతర రైతులందరికీ న్యాయం జరుగుతుంది. తెలంగాణ

## దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులను ప్రోత్సహిస్తున్న ఏకైక ప్రభుత్వం మనది

## విజయ మెగా డెయిరీని ప్రారంభించిన మంత్రి కేటీఆర్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని రావిర్యాల వద్ద దేశంలోనే అత్యాధునిక, ఆటోమేషన్ ప్రాసెసింగ్ టెక్నాలజీతో నిర్మించిన విజయ మెగా డెయిరీని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ మెగా డెయిరీని 40 ఎకరాల విస్తీర్ణంలో రూ. 250 కోట్లతో నిర్మించారు. రోజుకు లక్ష లీటర్ల టెట్రా బిక్ పాల ఉత్పత్తి చేసేలా మిషనరీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాడి రైతులను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ ప్రసంగించారు.

**తెలంగాణలో తప్ప ఇతర రాష్ట్రాల్లో రైతుల కష్టాలు డబుల్ :** ప్రధాని నరేంద్ర మోదీ 2014లో ఒక మాట చెప్పారు.. అదేంటంటే 2022 నాటికి రైతుల ఆదాయం డబుల్ చేస్తానన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. రైతుల ఆదాయం డబుల్ అయిందా? అని ప్రశ్నించారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తప్పకుండా పరిపుష్టం అవుతోంది. తప్పకుండా గ్రామాల్లో సంపద పెరుగుతుంది. ఆ పెరిగిన సంపదతో తెలంగాణ సస్యశ్యామలంగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు.

**తెలంగాణలో ఐదు విప్లవాలు ఆవిష్కృతం..** ఇవాళ తెలంగాణలో ఐదు విప్లవాలు మీ కళ్ల ముందే ఆవిష్కృతమవుతున్నాయని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తద్వారా రైతుల ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. 2014లో కేవలం 68 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం ఉత్పత్తి అయ్యేది. ఇవాళ మూడున్నర కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. పంజాబ్, హర్యానాను దాటిపోయి దేశానికే అన్నపూర్ణ అయింది మన తెలంగాణ. ఇది హరిత విప్లవం ద్వారా సాధించామని కేటీఆర్ పేర్కొన్నారు.

ఇక రెండో విప్లవం నీలి విప్లవం.. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కోట్లాది చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. మన మత్స్యకారులు కోట్లాది చేపలను పెంచుతున్నారు. దీంతో మత్స్య సంపద అపారంగా పెరిగింది. ఇన్ లాండ్ ఫిషరీస్‌లో భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని కేటీఆర్ తెలిపారు. లక్షన్నర లీటర్ల పాలు తీసుకునే విజయ డెయిరీ.. ఇప్పుడు 4 లక్షల లీటర్లకు చేరింది. ఇది 10 లక్షల లీటర్లకు కూడా చేరుకోవచ్చు. మీరు ఆదరిస్తే క్షీర విప్లవం వచ్చే అవకాశం ఉందన్నారు కేటీఆర్. గొర్రెల పంపిణీ కూడా చేపట్టాం. రూ. 11 వేల కోట్లతో యాదవ, కురుమ సోదరులకు గొర్రెలను అందిస్తున్నాం. తద్వారా మాంస ఉత్పత్తి అవుతోంది. అంటే గులాబీ విప్లవం వస్తుంది. దీంతో యాదవ, కురుమ సోదరులకు అదనపు ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఇచ చివరిది.. ఎల్లో విప్లవం. అదే ఆయిల్ పామ్ రెవల్యూషన్.. 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను ప్రోత్సహిస్తున్నాం. రైతు ఆదాయం డబుల్ కావాలంటే ఈ ఐదు విప్లవాలు కలిసికట్టుగా నడిస్తే గ్రామీణ ప్రాంతాల్లో రైతు ఆదాయం రెట్టింపు అవుతుంది. ఈ ఐదు రకాల విప్లవాలు తెలంగాణలో మన కళ్ల ముందు సాక్షాత్కారం అవుతున్నాయి. అందుకే తెలంగాణ గ్రామాల్లో సంపద పెరిగిందని మంత్రి కేటీఆర్ వివరించారు.

# సంపాదకీయం

## బీజేపీ వర్సెస్ ఇండియా కూటమి అగ్గి రాజేస్తున్న కులగణన ఇష్యూ !

కుల గణన చేసిన తొలి రాష్ట్రంగా బీహార్ చరిత్రకు ఎక్కింది. ఈ దేశంలో 143 కోట్ల మంది పౌరులు ఉన్నారు. అయితే ఫలనా జనాభా అధికం అని అనుకోవడమే తప్ప కచ్చితమైన లెక్కలు అయితే లేవు. కానీ ఫస్ట్ టైం బీహార్ లో ఓబీసీలు 67 శాతం పైగా ఉన్నారంటూ కుల గణన చేసి మరీ అక్కడి నితీష్ కుమార్ ప్రభుత్వం లెక్క తేల్చింది. దీనికి రాహుల్ గాంధీ సమర్ధిస్తూ నేరుగా ప్రధాని మోడీని బీజేపీని టార్గెట్ చేశారు. ప్రధాని వద్ద 90 మంది కార్యదర్శులు ఉంటే ఓబీసీలు జస్ట్ ముగ్గురే ఉన్నారు, ఇదేనా అభివృద్ధి సమానత్వం అంటూ నిందించారు. ఈ దేశంలో ఎందుకు కుల గణన చేయలేకపోయారు అని ప్రశ్నించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే దేశమంతా కుల గణన చేస్తామని ఆయన ప్రకటించారు. ఇక దీని మీద నరేంద్ర మోడీ ఘాటుగానే రియాక్ట్ అయ్యారు. ఆయన మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్ లో జరిగిన ఒక సభలో మాట్లాడుతూ ఇండియా కూటమి మీద బాణాలు వేశారు. కులగణన అంటే ప్రజల మధ్య దారుణమైన విభజన మాత్రమే అన్నారు. ఇది మహా పాపం నేరం అని కూడా అన్నారు. విపక్షాలు ఇంతకు తెగిస్తాయా ప్రజల మధ్య విభజన తెస్తాయా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మోడీ ఏ పార్టీ పేరుని కానీ నాయకుడి పేరుని కానీ అసలు ప్రస్తావించలేదు. కానీ కుల గణనను ఆయన పూర్తిగా తప్పు పట్టారు. కులం పేరుతో గణన అంటే ప్రజల సున్నితమైన భావోద్వేగాలతో ఆడుకోవడమే అని మండిపడ్డారు. అసలు కులాల వారీగా విభజన చేసే ఎటువంటి ప్రయత్నం అయినా కూడా మహా పాపం అని ఆయన నిర్ధారించేశారు. ప్రతిపక్షాలకు అధికారం ఇస్తే అభివృద్ధి చేయకుండా అవినీతికి పాల్పడ్డాయని, ఇపుడు వారు ప్రతిపక్షంలో ఉంటే పేదలతో చెలగాటం ఆడుకుంటున్నారని విమర్శించారు. ఇదిలా ఉంటే కుల గణన అన్నది ఇపుడు విపక్షాలకు ఆయుధంగా మారుతోందా అన్న చర్చకు తెర లేస్తోంది. దేశంలో కులం మతం ఎపుడూ సున్నితమైన అంశాలే. 1990 ప్రాంతంలో జనతాదళ్ మండల్ కమిషన్ పేరుతో సున్నితమైన అంశాలను తెర ముందుకు తెచ్చి రాజకీయంగా బీజేపీని సవాల్ చేసింది. దాన్ని ధీటుగా ఎదుర్కోవడానికి బీజేపీ మందిర్ ఇష్యూని తెచ్చిందన్నది చరిత్రలో ఉంది. అంటే కులాన్ని మూసేసేది మతం కార్డు . అలా నాడు నరుక్కు వచ్చిన బీజేపీకి గడచిన మూడు దశాబ్దాల దేశ రాజకీయాల్లో సిద్ధాంతాల పరంగా ఎదురులేకుండా పోయింది. రాజకీయంగానే ఆ పార్టీ ఢీ కొంటూ వచ్చింది. అయితే ఇపుడు చూస్తే కుల గణన పేరుతో బీజేపీని ఇండియా కూటమి పెను సవాల్ విసురుతోంది. దీని వల్ల బీజేపీని ఉత్తరాదిన దెబ్బతీయడానికి సరైన ఆయుధాన్ని సమకూర్చుంటోంది అని అంటున్నారు. ఉత్తరాదిలో కులం మతం సున్నితమైన అంశాలుగానే ఉంటాయి. బీజేపీ చేతిలో ఆరు నెలలకు పైగా సమయం ఉంది. కుల గణన చేయాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. మరి దీని మీద బీజేపీ అనుసరించే విధానం ఏంటి అన్నదే చర్చగా ఉంది. ప్రధాని మోడీ కుల గణన మహా పాపం అంటున్న నేపధ్యం చూస్తే కనుక ఈ ఇష్యూ రేపటి ఎన్నికల్లో బీజేపీ వర్సెస్ ఇండియా కూటమి మధ్యన భీకర పోరుకు తావు ఇచ్చేలా కనిపిస్తోంది అని అంటున్నారు.

# పాఠం చెప్పరు.. పరీక్ష రాయాల్సిందే..!



మంచిర్యాల :ఇంటర్‌లో పర్యావరణ విద్య, నైతిక మానవ విలువల పరీక్షలు అత్యంత కీలకం. వీటిలో ఉత్తీర్ణులైతేనే ఇంటర్ విద్య పూర్తయినట్టు లెక్కా. కాని వీటి నిర్వహణలో భిన్న పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్యాసంవత్సరమంతా చెప్పిన పాఠాలకు పరీక్షలు నిర్వహిస్తుంటే ఈ రెండు సబ్జెక్టుల్లో చెప్పని చదువుకు పరీక్షలు నిర్వహిస్తుండటం, వాటిపై విద్యార్థులకు అవగాహన లేకపోవడంతో నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ పరీక్ష రాయని విద్యార్థులు మిగతా అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులైనా ఫెయిల్ ఐనట్టే. వీరికి మెమో రాకపోవడం, ఉన్నత విద్యకు అవకాశం లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అవగాహన లేమితో ఈ తంటాలు వారికి తప్పడం లేదు. ధ్రువీకరణ పత్రాలు అందక విద్యాసంవత్సరం నష్టపోవాల్సి వస్తోంది. గతేడాది కరోనా నేపథ్యంలో పరీక్షల నిర్వహణ సాధ్యం కాకపోవడంతో అసైన్‌మెంట్ రూపంలో విద్యార్థులు ఇంటివద్దే పరీక్షలు రాసి కళాశాలల్లో సమాధాన పత్రాలు అప్పగించారు. 2021-22 విద్యాసంవత్సరానికి గానూ ఈ నెల 11న నైతిక- మానవవిలువలు, 12న పర్యావరణ విద్య పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో ఏటా సుమారుగా 10 శాతం మంది విద్యార్థులు ఈ పరీక్షలకు దూరంగా ఉంటున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాలలు 57 వరకు ఉన్నాయి. వీటిలో సుమారు 17 వేల మంది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. దేశ భవితకు కేంద్ర బిందువైన యువతలో విశ్వసనీయత నింపేందుకు పర్యావరణ విద్య నైతిక- మానవ విలువల సబ్జెక్టులను ప్రవేశపెట్టారు. జీవన నైపుణ్యంలో విద్యార్థి నడవడికపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని ప్రథమ సంవత్సరంలో ప్రవేశపెట్టింది. ఉద్దేశం మంచిదే అయినా.. ఆయా కళాశాలల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నీరుగారుతుండడంతో పాటు విద్యార్థులకు నష్టం వాటిల్లుతోంది. ఈ సబ్జెక్టులను విద్యార్థులకు బోధించకపోవడమే కాకుండా వాటి గురించి అవగాహన కల్పించకపోవడం దీనికి ముఖ్య కారణమవుతోంది. బోధనలు అందించాల్సి ఉన్నా.. దాదాపు అన్ని కళాశాలల్లో ఈ రెండు సబ్జెక్టుల పాఠాలు చెప్పడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. పరీక్షల సమయంలోనే ఈ సబ్జెక్టులు ఉన్నాయనే విషయం వారికి తెలుస్తోంది. దీంతో పరీక్షల్లో ఏమి రాయాలో తెలియక గైర్హాజరవుతున్నారు.పాస్ మార్క్ వస్తే చాలని, ఇంటర్ మార్కులకు వీటిని కలపక పోవడంతో ఈ సబ్జెక్టును కేవలం మొక్కుబడిగానే పరిగణిస్తున్నారు. ఈ పరీక్షలకు ఏ కళాశాలలో చదివే విద్యార్థులకు ఆదే కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిని ప్రాధాన్యం లేని పరీక్షలుగా పలు కళాశాలలు కొట్టిపారేస్తూ చూచిరాతలను ప్రోత్సహిస్తుండడం విశేషం.మెమోలు రావువిద్యార్థులు తప్పనిసరిగా రెండు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. వీటిలో ఉత్తీర్ణులైతేనే పాస్ మెమో బోర్డు అందిస్తుంది. పరీక్షకు హాజరుకాక అనుత్తీర్ణులైతే ఉన్నత విద్యకు అవకాశం ఉండదు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలి..- ఆర్.శైలజ, డీఐఈవో

# నిర్మించారు.. వదిలేశారు



బోథ్ : ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి భవనాలను నిర్మిస్తోంది. కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలకు వీలుగా ఉండేందుకు, పనులను తొందరగా ముగించుకునేందుకు ఆయా అధికారులకు గదులను కేటాయిస్తూ భవన నిర్మాణాలను చేపడుతుంది. జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన వివిధ శాఖల భవనాలు నిరుపయోగంగా మారాయి. మండలాల్లో అన్ని హంగులతో భవన నిర్మాణాలు పూర్తయినా ఉపయోగానికి నోచుకోవడం లేదు. దీంతో సదరు కార్యాలయ పరిసర ప్రాంతాలు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. కార్యాలయ గోడలపై మొక్కలు పెరుగుతున్నాయి. కొన్ని మండలాల్లో భవనాలు నిర్మించినా ఇంకా అద్దె భవనాలలో సిబ్బంది విధులు కొనసాగించటం కొసమెరుపు. రూ.కోట్లు వెచ్చించి భవనాలను నిర్మించి, మళ్లీ రూ.వేలల్లో అద్దె చెల్లించడం వెనుక మర్మమేమిటో తెలియని పరిస్థితి. అద్దె భవనాల్లో చాలీచాలని గదుల్లో అధికారులు విధులు నిర్వర్తిస్తున్నా, సొంత వాటిని ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల అసలు అధికారులే లేకపోయినా భవనాలను నిర్మించి వదిలేశారు. చిన్న పనులు పూర్తవ్వ లేదనే కార్యాలయాలను ప్రారంభించటం లేదు. మద్యం బాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

విద్యుత్తు మీటరు బిగించలేక..బోథ్ మండల కేంద్రంలో రూ.55 లక్షలతో 2017లో నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నేటికీ ప్రారంభించలేదు. దీంతో ప్రస్తుతం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. అన్ని హంగులతో, పూర్తి సదుపాయాలతో నిర్మించి సంబంధిత గుత్తేదారు సంబంధిత శాఖ అధికారులకు భవనాన్ని గతంలోనే అప్పగించారు. నూతన కార్యాలయంలో విద్యుత్తు మీటరును అమర్చకపోవటంతో దాదాపు నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారింది. అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయాన్ని సొంత కార్యాలయంలోకి మార్చాలని లేదా శిథిలావస్థకు చేరిన మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సదరు భవనంలోకి మార్చాలని ఉద్యోగులు కోరుతున్నారు.ఇచ్చోడలోని ఐకేపీ కార్యాలయం నిర్మించి ఏళ్లు గడిచినా ఎవరూ పట్టించుకోక పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. ప్రస్తుతం ఐకేపీ కార్యాలయం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇరుకు గదులతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సమావేశాలను నిర్వహించుకోవటానికి సమావేశ మందిరం సైతం లేక మహిళలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

సిరికొండ మండల కేంద్రంలో కొన్నేళ్ల కిందట నిర్మించిన మండల విద్యావనరుల కేంద్రం ప్రారంభం కాలేదు. మండల విద్యాధికారి లేనప్పటికీ కార్యాలయం మాత్రం నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం సదరు భవనం పశువులు, మందుబాబులకు అడ్డాగా మారింది. మండలంలో తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాన్నయినా ఇక్కడికి మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

# ఊపిరితిత్తులపై నల్లమచ్చ

కొత్తగూడెం : సింగరేణి కార్మికుల్లో బ్లాక్‌లంగ్ వ్యాధి బయటపడటం ఆందోళన కలిగిస్తోంది.. బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణిలో గత ఐదేళ్లలో ఏడుగురు కార్మికులు న్యూమోకోనియోసిస్ వ్యాధి బారినపడ్డట్లు గుర్తించారు. బొగ్గు ధూళి కణాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లడం ద్వారా ఇది సంక్రమిస్తుంది. గనుల్లో ఉత్పత్తితో పాటు రవాణా, లోడింగ్ సమయంలో అధికంగా ధూళి కణాలు గాలిలో కలిసిపోతుంటాయి. అవి నాసిక రంధ్రాల ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరుకోవడంతో వ్యాధి సంక్రమించే ప్రమాదం ఎక్కువ. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది.సింగరేణిలో 42 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 30 వేల మంది కార్మికులు బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో పనిచేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో ఏడుగురు కార్మికులకు బ్లాక్‌లంగ్ వ్యాధి సోకినట్లు పార్లమెంటులో ఎంపీ ప్రమోద్‌కుమార్ ఝా మూడ్రోజుల కిందట ప్రస్తావించడంతో ఒక్కసారిగా ఇది వెలుగులోకి వచ్చింది. ఇటీవల కొత్తగా ఎక్కడా కేసులు నమోదు కాకపోవడం ఊరటనిచ్చే అంశం. వ్యాధి బాధితుల్లో ముగ్గురికి నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించారు. మరికొంత మందికి ఉపరితల విభాగాల్లో విధులు కల్పించారు.

అప్రమత్తతతోనే దూరం బొగ్గు ధూళి వెలువడే ప్రాంతంలో విధులు నిర్వహించే కార్మికులు విధిగా మాస్కు ధరించాలి.సింగరేణిలో 22 భూగర్భ, 20 ఉపరితల గనుల ద్వారా రోజుకు 2.5 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారు. బయటకు రవాణా చేయడంతో పాటు వినియోగదారులకు పంపే లారీలు, వ్యాగన్‌లలో నిరంతరం లోడింగ్ చేస్తుంటారు. బంకర్‌ల నుంచి లారీల్లో నింపే సమయంలో బొగ్గు ధూళి గాలిలో కలుస్తుంది. వీటిల్లో 5 మైక్రాన్‌ల కంటే తక్కువ స్థాయిలో ఉండే కణాలతోనే ప్రమాదం ఉంటుంది. వీటిని గాలిలో కలవకుండా చేసేందుకు పని ప్రాంతాలు, ప్రభావిత ప్రాంతాల రహదారులపై నిరంతరం నీళ్లు చల్లించాలి. పరిసర ప్రాంతాల్లో మొక్కలు పెంచడం ద్వారా ధూళి వ్యాప్తిని అడ్డుకోవచ్చు. సమస్యాత్మక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.వ్యాధి గుర్తించడం ఇలా..బాగా దగ్గు రావడంతో పాటు ఆయాసం వస్తుంది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉన్నా వైద్యులను సంప్రదించాలి. సాధారణంగా మొదలయ్యే దగ్గు రోజురోజుకు పెరుగుతుంది. న్యూమోకోనియోసిస్‌గా గుర్తిస్తే 6 నెలల వరకు ప్రత్యేక వైద్యం తీసుకోవాలి.

ఇటీవల కాలంలో కొత్తగా బ్లాక్‌లంగ్(న్యూమోకోనియోసిస్) కేసులు నమోదు కాలేదు. ఐదేళ్ల కాలంలో ఏడు కేసులు మాత్రమే నమోదయ్యాయి. గుర్తించిన రోగులకు వైద్యం అందించాం. న్యూమోకోనియోసిస్‌గా గుర్తించిన వారికి పరిహారం అందజేశాం. వ్యాధికారణంగా పెద్ద ప్రమాదమేమీ ఎదురుకాలేదు.

కాలుష్య ప్రభావిత ప్రాంతాలు ఉభయ జిల్లాల్లోని కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాల్లోని కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ల వద్ద ఎగిసే దుమ్ము, ధూళి కార్మికుల ఆరోగ్యాల్ని దెబ్బతీసేలా ఉంటోంది. ఇల్లెందు జేకే ఓసీ, టేకులపల్లి కేవోసీ, మణుగూరులోని మరో మూడు ఓసీలు, కొత్తగూడెంలోని జీకే ఓసీ, సత్తుపల్లిలోని రెండు ఉపరితలగనుల్లో పేలుళ్లు నిర్వహించినప్పుడు బొగ్గు రేణువులు, దుమ్ము, ధూళి పైకెగిసి పడుతుంది. ఆ తర్వాత గనుల్లోకి వెళ్లేవారు, సమీప ప్రాంతాల వాసులు కాలుష్య సమస్య ఎదుర్కొంటున్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

సిద్దిపేట : నిర్మాణాలు చేపట్టే వారికి మున్సిపల్ ద్వారా పొందే అనుమతులు మరింత సులభతర మయ్యేందుకు ప్రభుత్వం టీఎసబీపాసను ప్రవేశపెట్టింది. ఈ పోర్టల్ ద్వారా నేరుగా సదరు యజమాని సంబంధిత డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేసిన 21 రోజుల్లోనే అనుమతులు పొందే అవకాశం కల్పించారు. దీని ద్వారా మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం కూడా లేకుండా పారదర్శకతకు పెద్దపీట వేశారు. అంతేగాకుండా 70 గజాల లోపు విస్తీర్ణం కలిగిన వారికి కేవలం ఒక్క రూపాయికే ఇంటి నిర్మాణ అనుమతులను అందజేస్తున్నారు. ఈ పథకంలో ఇచ్చిన అనుమతుల ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, ఎటువంటి అదనపు కట్టడాలు చేపట్టరాదని జీవోలో పేర్కొన్నారు. ప్రతీ భవనానికి కొన్ని షరతులతో కూడిన అనుమతులను ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తున్నారు. అనుమతికి మించి విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే టాస్క్‌ఫోర్స్ కమిటీ కూల్చివేతలు చేపట్టాలని చట్టంలో పేర్కొంది. ప్రజల వ్యయప్రయాసాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా అనుమతులను ప్రభుత్వం జారీ చేస్తుంటే నిర్మాణదారులు మాత్రం అడ్డదారుల్లో వెళ్తున్నారు. టీఎసబీపాస్ ద్వారా అనుమతులను పొందడం ఒక రకంగా అయితే నిర్మాణం చేసేది మాత్రం మరొక రకంగా చేపడుతున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్ర ప్రధాన రహదారికి ఆనుకుని నిర్మిస్తున్న భవనాలు అనుమతికి విరుద్ధంగా చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

సెట్‌బ్యాక్ నిబంధనలు ఇవే- 200 గజాల లోపు ఉంటే రోడ్డు వైపు 5 ఫీట్లు, మిగతా మూడు వైపులా 3, 5 ఫీట్లు వెనక్కి జరిగి స్లాబు వేసుకోవాలి.- 100 గజాల లోపు అయితే రోడ్డుకు 5 ఫీట్లు, మిగిలిన రెండు వైపులా 2 ఫీట్లు వదలాలి.- సెట్‌బ్యాక్ స్థలంలో స్లాబు, ప్రహరీ, సెప్టిక్ ట్యాంకు ఉండకూడదు.- భవన నిర్మాణ దరఖాస్తుకు ముందే 246 గజాలు దాటిన భవనానికి పది శాతం మార్టిగేట్ వర్తిస్తోంది. జీం2 దాటితే తప్పనిసరిగా చేయాలి అదనపు నిర్మాణాల కూల్చివేతమెదక్ మున్సిపల్ పరిధిలో టీఎసబీపాస్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై టాస్క్‌ఫోర్స్ కొరడా ఝులిపిస్తోంది. ఫిబ్రవరి, మార్చిలో మూడు దఫాలుగా అక్రమ, అదనపు కట్టడాలను గుర్తించింది. టాస్క్‌ఫోర్స్ అధికార బృందం అయినటువంటి తహసీల్దార్, ఆర్అండ్‌బీ డీఈ, ఫైర్ ఆఫీసర్, పోలీస్ అధికారులు గుర్తించిన భవనాల కూల్చివేతలకు వెనుకాడటం లేదు. ఇప్పటి వరకు 14 భవనాల అదనపు నిర్మాణాలను కూల్చివేసిన టాస్క్‌ఫోర్స్, మరో 12 భవనాల అదనపు కట్టడాలను కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేసింది. త్వరలోనే వీటిని కూడా బృందం ఆధ్వర్యంలో కూల్చివేయబోతున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి తెలిపారు.నిర్లక్ష్యం.. అవగాహన లేమిటీఎసబీపాస్ ద్వారా నిర్మాణదారులకు అనుమతులు సులభతరంగా మారినప్పటికీ వారిలో మాత్రం నిర్లక్ష్యం తగ్గడం లేదు. మున్సిపల్ అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతూ టాస్క్‌ఫోర్స్ దృష్టిని ఆకర్షిస్తున్నారు. నూతన మున్సిపల్ చట్టం ప్రకారం అనుమతుల మేరకు కట్టడాలు చేపట్టాలని ఆదేశించినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. అవగాహన లేమితో ఇష్టానుసారంగా నిర్మాణాలను చేపడుతున్నారు. ఇలాంటి సమయంలో ఫిర్యాదులందుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం నిర్మించిన అదనపు కట్టడాలను కూల్చివేస్తుంది. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల అవగాహనలేమితో కొత్తకొత్త కట్టడాలు నేలకూలుతున్నాయి. దీంతో లక్షల రూపాయలు నిర్మాణదారులు నష్టపోవాల్సి వస్తోంది.

# మైనింగ్ కలకలం

వికారాబాద్ :యాచారం మండలంలోని అటవీ, గుట్టల ప్రాంతాల్లో మైనింగ్ ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలతో రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పొలాల మధ్య ఉన్న భూముల్లో క్రషర్లు ఏర్పాటు చేస్తే దుమ్ముధూళి, స్టోన్‌పౌడర్ పడి పంటలు పాడవుతాయని ఆందోళన చెందుతున్నారు. నీటి వనరులూ ఉనికిని కోల్పోతాయని.. తమ గ్రామాల పరిధిలో క్రషర్ల బిగింపునకు ఒప్పుకునే ప్రసక్తే లేదని యాచారం, నందివనపర్తి, మొండిగౌరెల్లి గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. యాచారం మం డలం మైనింగ్ జోన్ ఏర్పాటు కలకలం రేపుతోంది. హెచ్ఎండీఏ పరిధిలో మైనింగ్‌కు నిషేధం ఉన్నా వ్యాపారులు ఖాతరు చేయడం లేదు. యాచారం, నందివనపర్తి, మొండిగౌరెల్లి గ్రామాల్లో క్రషర్ మిషన్లు బిగింపునకు కొందరు వ్యాపారులు పావులు కదుపుతున్నారు. మైనింగ్‌జోన్ వద్దంటూ నాలుగున్నరేళ్లుగా మొండిగౌరెల్లి, యాచారం, నందివనపర్తి రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని క్రషర్లు బిగించేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. అదేజరిగితే చుట్టుపక్కల ప్రాంతాలు దుమ్ముధూళితో కాలుష్య కాసారమై పంటలు పండవని, ఇక్కడ నివాసయోగ్యంగా కూడా ఉండదని రైతులు హెచ్చరిస్తున్నారు. క్రషర్లు పెడితే వందల ఎకరాలు బీడుగా మారుతాయని అంటున్నారు.

అనుమతి లేకుండా రోడ్డు.. గట్టు చప్పుడు కాకుండా అనుమతులు!యాచారానికి రెండు కిలోమీటర్ల దూరంలో సర్వే 146లో రెవెన్యూ అనుమతి లేకుండానే క్రషర్ వ్యాపారులు కిలోమీటర్నన్నర మట్టి రోడ్డును వేశారు. ప్రభుత్వ భూమిలో రోడ్డు వేసినా రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పట్టించుకోలేదు. యాచారం సర్వే నెంబర్ 121లో 39ఎకరాల్లో భారీ క్రషర్లు బిగింపునకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ ఒప్పందం చేసుకుందని తెలుస్తోంది. యాచారం సర్వే నెంబర్ 105, 121, 126, 132, 200లలో 618ఎకరాలను పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లా మైనింగ్ అధికారులను ఆదేశించింది. 142 నుంచి 144, 146, 149, 151 సర్వే నెంబర్లలో 2019 ఫిబ్రవరి 6 నుంచి 2024 ఫిబ్రవరి 14 వరకు క్వారీ లీజు మంజూరు చేస్తూ గనుల శాఖ 2020లో ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా యాచారంలోని 159, 191, 200, 192 సర్వే నెంబర్లలో క్రషర్ మిషన్లు బిగింపునకు అధికారులు దృష్టిసారించినట్లు తెలిసింది.పశువులు, వన్యప్రాణుల మనుగడ కష్టమే..మొండిగౌరెల్లిలో 19సర్వే నెంబర్‌లో 1,200ఎకరాల భూమి ఉంది. ఇందులో 300ఎకరాలను గతంలో పేదలకు అసైన్ చేశారు. ఈ భూముల్లో రైతులు బోర్లు వేసి కూరగాయ పంటలు సాగుచేస్తున్నారు. సర్వే నెంబర్ 19లోని గుట్టల్లో 2026 మే19 వరకు ప్రభుత్వం క్రషర్లకు లీజుకు ఇచ్చింది. ఇక్కడ క్రషర్లు బిగిస్తే రాతి పొడి పరుచుకొని యాచారం, గడ్డమల్లాయగూడ, మొండిగౌరెల్లి, గున్గల్ గ్రామాల్లో పంటలు పండకుండాపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లోని అడవుల్లో వన్యప్రాణులకూ మనుగడ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అడవులపై ఆధారపడి వ్యవసాయ అనుబంధంగా ఉన్న పశువులు, గొర్లు, మేకల, పెంపకం కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందని.. జీవాలకు మేత దొరకడం కష్టమవుతుందని స్థానికులు అంటున్నారు.క్రషర్లతో నీటి వనరుల ఉనికికీ దెబ్బే!నానక్‌నగర్, పిల్లిపల్లి గ్రామాల మధ్య నందివనపర్తి సర్వే నెంబర్ 581/20లో 329 ఎకరాలు ఉండగా దానిలో 17ఎకరాల 38గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో క్రషర్లు బిగింపునకు యత్నిస్తున్నారు. తాడిపర్తి, పిల్లిపల్లి, గొల్లగూడ, నానక్‌నగర్, బొల్లిగుట్టతండా, నందివనపర్తిల్లో పంట భూముల్లో స్టోన్ పౌడర్ పరుచుకొని పంటలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. నాలుగు చెరువుల అలుగులు, తూములు మూసుకుపోయి నీటి వనరులే లేకుండా పోయే పరిస్థితి వస్తుందనడంలో సందేహం లేదు. దీంతో మత్స్యకారులు సైతం ఉపాధి కోల్పోతారు. మొండిగౌరెల్లిలో క్రషర్లు వద్దుమొండిగౌరెల్లిలో క్రషర్లు పెట్టొద్దు. ఈ ప్రాంతంలో మైనింగ్ జోన్ వస్తే పంటలు పండక రైతులంతా వీధిన పడతారు.

# రుణమాఫీపై గందరగోళం

ఆసిఫాబాద్ : ప్రభుత్వం ప్రకటించిన పంట రుణమాఫీ అమలు కానీ రైతులను అయోమయానికి గురవుతున్నారు. తప్పిదాల సవరణకు అటు బ్యాంకులు, ఇటు వ్యవసాయ శాఖ అధికారులు అవకాశం లేదని చెబుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఎవరూ సరైన కారణాలు చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది ఖాతాలకు ప్రభుత్వం మాఫీ డబ్బులు జమ చేస్తున్నా.. వివిధ కారణాలతో డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ఫెయిల్ అని వస్తుంది. జిల్లాలో ఇలాంటివి 202 ఉన్నాయని.. వాటిని క్షేత్ర స్థాయిలో ఏఈఓలు పరిశీలిస్తున్నట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి డీబీటీ ఫెయిల్ అయినవి(అన్ని రకాలు కలిపి) 2787 మంది ఉన్నట్లు వ్యవసాయశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ, బ్యాంకర్ల మధ్య సమన్వయలోపం కర్షకుల పాలిట శాపంగా మారింది. జిల్లాలో 67,988 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా బ్యాంకు అధికారులు గుర్తించారు. వివిధ బ్యాంకుల్లో రూ.463 కోట్ల రుణం తీసుకున్నట్లు తెలిపారు. కానీ ఇప్పటి వరకు జిల్లాలో 45,304 మంది రైతుల ఖాతాలకు సంబంధించి రూ.209.41 కోట్ల రుణ మొత్తాన్నే ప్రభుత్వం జమ చేసింది. కొందరు రైతుల ఖాతాలు బంద్ కావడం, మరికొందరు మృతి చెందడం, ఖాతా నంబర్ల నమోదులో తప్పులు, బ్లాక్ కావడం, కొందరి ఆచూకీ లభించకపోవడం, కొందరి ఆధార్ నంబర్లు ఇద్దరు, నమోదు కావడం తదితర సమస్యలు ఉన్నాయి.

అనేక తప్పిదాలు..

జిల్లాలో ఒకరి ఆధార్ నంబరు మరో ఇద్దరు ముగ్గురు ఖాతాలకు నమోదయ్యాయి. అలాంటి వారి రుణమాఫీ డబ్బులు నిలిచిపోయాయి. జిల్లాలో ఇలాంటివారు 1824 మంది ఉన్నారు. వీరు పొందిన రుణం రూ.181 కోట్లు. ఈ తప్పిదాలు బ్యాంకర్ల పొరపాటున చేసినవా? లేదా సాంకేతిక సమస్యలా అన్నది ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. ఇలాంటి వాటి సవరణపై ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నట్లు బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

నీ ప్రభుత్వం కుటుంబానికి రూ.లక్ష వరకే పంట రుణమాఫీ చేసింది. ఒక్కో కుటుంబంలో భార్యాభర్తలు కలిపి రూ.లక్షకు పైగా రుణాలు పొందినవారు ఉన్నారు. ఇలాంటి వారి విషయంలో ఫ్యామిలీ గ్రూపింగ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా స్పష్టత వచ్చి ప్రభుత్వం మాఫీ డబ్బులు ఖాతాల్లో జమ చేసే వీలుంటుంది. కానీ జిల్లాలో అది జరగకపోవడంతో 526 ఖాతాలకు సంబంధించి డబ్బులు రాలేదు. ఇవే కాకుండా 854 మంది రైతులవి ఆధార్ నంబర్లు నమోదు కాలేదు. 21 మంది ఖాతాలు సరిపోలడం లేదు. కొన్ని రుణ ఖాతాలు ఒకే ఆధార్ నంబరుతో పునరావృతం అయ్యాయి. ఇలా అనేక తప్పిదాలతో చాలా మంది రైతులకు మాఫీ డబ్బులు జమ కావడం లేదు. ప్రభుత్వం రుణమాఫీకి ఖాతాల వివరాలను ఏ, బీ, సీ మూడు విభాగాలుగా గుర్తించింది. దీనిలో సీ విభాగంలో నెలకొన్న సమస్యలను మాత్రమే బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు పరిశీలిస్తున్నారు. మిగతా వాటిని ప్రభుత్వమే పరిశీలించి, పరిష్కరిస్తుందని అధికారులు చెబుతున్నారు.

అధికారి ఏమన్నారంటే..: జిల్లాలో రుణమాఫీ విషయంలో నెలకొన్న సమస్యలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావును చరవాణిలో సంప్రదించగా.. ప్రభుత్వం విడతల వారీగా మాఫీ డబ్బులు జమ చేస్తుందన్నారు. సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తున్నామన్నారు. జిల్లా పాలనాధికారి సైతం తరచూ సమావేశాలు నిర్వహించి వివరాలు అడుగుతున్నారని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా.. మా దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకు చెప్పి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నా ఆధార్ మరొకరి ఖాతాకు నమోదైందట

ఆర్.వెంకటి, నంబాల, రెబ్బెన

నాకు 2.5 ఎకరాల భూమి ఉంది. బ్యాంకులో రూ.65 వేల పంటరుణం తీసుకున్నా. రూ.లక్ష వరకు పంట రుణమాఫీ ప్రకటించడంతో వస్తాయని ఆశపడ్డా. నెల గడుస్తున్నా.. రాకపోవడంతో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించా. నా ఆధార్ నంబరు మరొకరి ఖాతాకు నమోదై ఉన్నట్లు చెప్పారు. ఇలాంటి వారికి ఇంకా డబ్బులు జమ కావడంలేదని.. ప్రభుత్వ నిర్ణయం వచ్చే వరకు వేచి చూడాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

# నిర్మాణ సంస్థ అలసత్వం.. ప్రయాణికులకు శాపం

ఆసిఫాబాద్ : వాహనదారులు, ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి నాలుగు వరుసల రహదారిని నిర్మించింది. పీయూపీ(పబ్లిక్ అండర్ పాస్)ల్లో నీరు నిలవడం, దీపాలు వెలగకపోవడం, ప్రయాణ ప్రాంగణాల్లో అంధకారం, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణ సంస్థ, జాతీయ రహదారుల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇక్కట్లపై కథనం.

పట్టింపు కరవు..నేరడిగొండ వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో భారీ వాహనాలు నిలిపే స్థలం ఉంది. అక్కడ ఒక్కో వైపు 10కిపైగా, జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మాణ సమయంలో 20 విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. దీపాలు వెలగడం లేదు. సంబంధిత రోడ్డు నిర్మాణ సంస్థ నిర్వాహకులు పట్టించుకోక వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి.

అంధకారంలోనే..

జాతీయ రహదారిగుండా నిత్యం వేల మంది ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. నేరడిగొండ ప్రయాణ ప్రాంగణంలో దీపాలు లేక మహిళలతో పాటు ప్రయాణికులు చీకటిలో బిక్కుబిక్కుమంటూ కూర్చుంటారు. ఈ విషయమై రోడ్డు నిర్మాణ సంస్థ వారిని సంప్రదించగా ప్రయాణ ప్రాంగణాల్లో దీపాలు ఏర్పాటు చేయడం తమ పరిధిలోకి ఉందన్నారు. వానొస్తే నీరు నిలిచి..రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు ప్రజల రాకపోకల సౌకర్యార్థం అవసరమైన చోట పీయూపీలు నిర్మించారు. ప్రస్తుతం కుప్టితో పాటు లఖంపూర్, సాత్‌నెంబర్, ఇస్లాంపూర్, కొర్టికల్, నేరడిగొండ మండల కేంద్రంలోని అన్ని పీయూపీల్లో నీరు నిలిచి బురదమయంగా మారాయి. ప్రజలు కాలినడకన రాకపోకలు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు.

ఎప్పుడేం జరుగుతుందో తెలియదు

జాతీయ రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. రహదారిపైకి చొచ్చుకొచ్చాయి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు చేసేటప్పుడు ఈ పొదల మాటునుంచి పందులు, మనుబోతులు, కుక్కలు రోడ్డుపైకి వస్తే ప్రమాదాలు జరిగి, ప్రాణాలు గాల్లో కలిసే అవకాశం ఉంది.

సమస్యలు పరిష్కరిస్తాం..రామ్మోహన్‌రెడ్డి, జాతీయ రోడ్డు నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జిమేం నిర్మాణం చేపట్టిన రోడ్డు పరిధిలో పిచ్చిమొక్కల తొలగింపు, పీయూపీల్లో నీరు నిలవకుండా మరమ్మతులు చేయించడానికి కృషి చేస్తా. నేరడిగొండ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. ప్రయాణప్రాంగణాల్లో స్థానిక సంస్థలే విద్యుద్దీపాలు ఏర్పాటు చేయించుకోవాలి.

# రేపటి శాస్త్రవేత్తలకు స్వాగతం



గద్వాల : విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించి ప్రాజెక్టుల రూపకల్పనకు ఇన్‌స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శన, స్కూల్ ఇన్నోవేషన్ వంటి కార్యక్రమాలు అమలు చేస్తుంటారు. అయితే.. కేంద్రం ప్రభుత్వ పరిధిలోని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలో నిర్వహించే జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్(నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్-ఎన్‌సీఎస్‌సీ) ఇందుకు భిన్నంగా ఉంటుంది. సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సామాజిక అంశాలను విశ్లేషణ చేసి ప్రాజెక్టు రూపకల్పన చేయాల్సి ఉండటంతో.. విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుంది. ప్రస్తుతం 2023-24 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 10 నుంచి 17 సంవత్సరాల వయసున్న విద్యార్థులంతా ఇందులో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నారని జోగులాంబ జిల్లా సైన్సు అధికారి భాస్కర్ పాపన్న తెలిపారు.

6 నుంచి ఇంటర్ విద్యార్థులకు: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 6 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. అయిదు జిల్లాల పరిధిలో మొత్తం 4 వేలకుపైగా పాఠశాలలుండగా, 198 ఇంటర్ కళాశాలలున్నాయి. 6 నుంచి 10వ తరగతి వరకు 2.40 లక్షల మంది, ఇంటర్‌లో 65 వేల మందికి పైగా ఉన్నారు. వీరంతా పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఒక్కో పాఠశాల నుంచి ఎన్ని ప్రాజెక్టులైనా ప్రదర్శించవచ్చు. ప్రతి పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయులు చొరవ చూపితే ఎక్కువ మొత్తంలో ప్రదర్శనలకు అవకాశం ఉంటుంది.

ప్రధాన, ఉప అంశాలతో..: విద్యార్థులు ప్రాజెక్టు రూపకల్పన కోసం ప్రధాన, ఉప అంశాలను కేటాయిస్తారు. ఈ సారి 'ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' అనేది ప్రధానాంశంగా ఉంటుంది. ఇందులో ఉప అంశాలుగా పర్యావరణ వ్యవస్థ-సంబంధిత సేవలు, ఆరోగ్యం పోషణ సంక్షేమం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక సాంస్కృతిక పద్ధతులు, స్వావలంబన కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం అనేవి ఉప అంశాలుగా ఉన్నాయి.

విద్యార్థులకేపేటెంట్ హక్కు

విద్యార్థులు తమ ఆలోచనలను, క్షేత్ర స్థాయిలో విశ్లేషించిన వాటిని ప్రాజెక్టు రూపంలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ అక్టోబరు చివరి వారంలో జిల్లా స్థాయి, నవంబరు మాసంలో రాష్ట్ర స్థాయి, డిశంబరు 27 - 31 తేదీల్లో జాతీయ స్థాయి ప్రదర్శనల్లో పాల్గొని ప్రతిభ చాటేందుకు ఈ వేదిక అవకాశం కల్పిస్తుంది. ఇందులో ప్రతిభ చాటితే విద్యార్థులకు పేటెంట్ హక్కులు కల్పిస్తారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

క్షేత్రస్థాయిలో విద్యార్థులు పరిశీలించడం, సమాచార సేకరణ, సర్వే పద్ధతులు, విశ్లేషణ సామర్థ్యం పెంచి సృజనాత్మకతను ప్రోత్సహించడం, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం కనుగొనేలా ప్రేరేపించడమే లక్ష్యంగా ఎన్‌సీఎస్‌సీ చర్యలు చేపడుతోంది. గతంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. దీంతో ఈ సారి ఎక్కువ మొత్తంలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మొదటగా గద్వాల జిల్లా కేంద్రంలో ఈ నెల 16న, అనంతరం నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

# దోమల బెడద.. రోగాలతో దడ



గద్వాల : మురుగుకాల్వల్లో వ్యర్థాలు సకాలంలో తొలగించకపోయినా, నిలిచి ఉండే మురుగునీటి కారణంగా దోమలు వ్యాపించే ప్రమాదముంది.పురపాలికల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధికారులు పెద్దఎత్తున ఖర్చు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో తగినంత ఫలితం ఉండట్లేదు. ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతూ రోగాలబారిన పడుతున్నారు. కందకంలో భారీగా చెత్త: జిల్లాలోని నాలుగు పురపాలికల్లో పారిశుద్ధ్య పనులకు అధికారులు ఏడాదికి రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నప్పటికీ మురుగు సమస్యను మాత్రం పూర్తిస్థాయిలో పరిష్కరించడం లేదు. కార్మికుల జీతభత్యాలతోపాటు బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ తయారీ, ఫాగింగ్, తదితర వాటికి నిధులు విడుదల చేస్తున్నప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి.

ఎక్కడెక్కడంటే..జిల్లాకేంద్రంలోని శివారు ప్రాంతాలైన ఐడీఎస్‌ఎంటీ కాలనీ, పిల్లిగుండ్లకాలనీ, హమాలీకాలనీ, దేవేందర్‌నగర్, వెంకటరమణకాలనీ, వినాయకనగర్, తాయమ్మగుడి ప్రాంతం, రెండోరైల్వేగేటు కాలనీల్లో పూర్తిస్థాయిలో మురుగుకాల్వలు లేకపోవడంతో గృహ సంబంధ వ్యర్థాలు పరిసరాల్లోనే నిలిచిపోతున్నాయి. గద్వాల సంస్థానాదీశులు పట్టణ రక్షణకు సుమారు మూడు కి.మీ.ల దూరం నిర్మించిన కందకాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో ప్రస్తుతం మురుగు ప్రవాహానికి అడ్డంకులేర్పడుతున్నాయి. దాంతో కందకంలో భారీగా వ్యర్థాలు నిలిచిపోయి విపరీతమైన దోమల బెడదతో చుట్టుపక్కల కాలనీ ప్రజలు తంటాలు పడుతున్నారు.

అయిజలోని భరత్‌నగర్, కొత్త ఎస్సీ కాలనీ, రాఘవేంద్రకాలనీ, గాజులపేట, బూరందొడ్డికాలనీ, పద్మావతీకాలనీతోపాటు వడ్డేపల్లిలోని వాల్మీకీ కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీల్లో మురుగునీరు పరిసరాల్లో నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి.

అలంపూర్‌లో భూగర్భ డ్రైనేజీతో పెద్దగా దోమలు లేనప్పటికీ పురపాలికలో విలీనమైన ఇమాంపూర్ గ్రామంలో వందశాతం మురుగుకాల్వలు లేకపోవడంతో సమస్య నెలకొంది.

ప్రజల ఖర్చు రూ.10 కోట్లు: నాలుగు పురపాలికల్లో సుమారు 40వేలకు పైగా కుటుంబాలు నివసిస్తుండగా ప్రతి ఇంట్లో దోమల నివారణకు నెలకు రూ.200 వరకు ఖర్చు చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మస్కిటో కాయిల్స్, లిక్విడ్స్ కొనుగోలుకు అన్ని కుటుంబాలు కలిపి నెలకు దాదాపు రూ.80 లక్షల వరకు, ఏడాదికి సుమారు రూ.10 కోట్లు వెచ్చించాల్సి వస్తోందంటే దోమల బెడద ఎంతగా ప్రజల ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతుందో అర్థం చేసుకోవచ్చు.

వ్యాధుల బారిన..: దోమలు కుట్టి జనం డెంగీ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులకు గురికావాల్సి వస్తోంది. ఈ సీజన్‌లో ఇప్పటికే జిల్లాలో 30 వరకు డెంగీ, 100కి పైగా మలేరియాతో కేసులు బయట పడ్డాయి. పుర అధికారులు పక్కా ప్రణాళికతో పారిశుద్ధ్య పనులు చేయించడంలో విఫలమవుతుండగా, ఆయా కౌన్సిల్ సభ్యులు సైతం దోమల బెడదను రూపుమాపడంలో చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం 'స్వచ్ఛత హీ సేవ' పేరుతో పురపాలికల్లో తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారగణం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నివారణకు చర్యలు: కందకంలో ఆయిల్‌బాల్స్ వదులుతుండటంతో లార్వా వృద్ధిచెందకుండా నివారించగలుగుతున్నాం. అన్ని వార్డుల్లో తరచూ ఫాగింగ్ చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా తమ పరిసరాల్లోని నీటి తొట్టెలు, టైర్లు, కొబ్బరి బొండాలు, తదితరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. ఇటీవల సీఎం కేసీఆర్ పురపాలికకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో కందకంలో పేరుకున్న వ్యర్థాలు పూర్తిగా తొలగించేందుకు కౌన్సిల్ సభ్యుల సహకారంతో కృషి చేస్తాం.నర్సింహ, కమిషనర్, గద్వాల

# ఇంటర్ కళాశాల మార్పునకు అవకాశం

వనపర్తి : 2023-24 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు తమకు ఇష్టం వచ్చిన కళాశాలలో చేరేందుకు, మరో కళాశాలలో ప్రవేశం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇష్టంలేని కళాశాలలో చేరి బలవంతంగా చదువుకుంటున్నామనుకునే విద్యార్థులకు కాస్త వెసులుబాటు కలిగినట్లయ్యింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరిన వారు ప్రైవేటులోకి, ప్రైవేటులో చేరాక ప్రభుత్వ కళాశాలలో సీటు వచ్చిన వారు కళాశాల మార్పు కోరుకుంటున్నారు. గతంలో ఇలా కళాశాల మారే అవకాశం లేక విద్యార్థులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వ కళాశాలలో సీటు వచ్చినా ప్రైవేటు నుంచి మారలేక ఆర్థికభారం మోయాల్సి వచ్చింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వం కళాశాల మారే అవకాశాన్ని ఈ నెల 16వ తేదీ వరకు కల్పించింది. ఇప్పటికే జూనియర్ కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా మొదటి సంవత్సరం విద్యార్థులు కోరుకున్న కళాశాలకు మారొచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..: ప్రభుత్వం తాజాగా కళాశాలలు మారే గడువు పెంచిన నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 58 కళాశాలల్లోని మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఉమ్మడిజిల్లాలో కలిపి మొత్తం 25 వేల మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందారు.

వీరిలో కనీసం పది శాతం మంది విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలకు మారే అవకాశం ఉందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్రంలో ఏ కళాశాలకైనా మారొచ్చు. ఒక ప్రభుత్వ కళాశాల నుంచి మరో ప్రభుత్వ కళాశాలకు మారేందుకు పెద్దగా అడ్డంకి ఉండదు. ప్రైవేటు కళాశాలల నుంచి సమస్య ఎదురవుతోంది. గతంలో ప్రైవేటు లో చేరాక ప్రభుత్వ కళాశాలలో సీటు వచ్చినా టీసీ ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలలో చేరేందుకు మార్పు కోరుకునే విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు అవకాశం ఇస్తాయన్నది అనుమానమే. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్కో ప్రభుత్వ కళాశాలలో 176 చొప్పున సీట్లు మంజూరు చేశారు. జిల్లా కేంద్రాల్లో అయితే కళాశాలల సంఖ్య, కోర్సులను బట్టి 780 పైగా సీట్లు ఇచ్చారు.

# మందులు ఇవ్వరు.. వైద్యం చేయరు

ఆసిఫాబాద్: అన్నదాతల ఆత్మీయ నేస్తాలైన మూగజీవాలు జబ్బు పడితే చికిత్సకు నోచుకోవడం లేదు. రైతులే పశువైద్యులుగా మారి తమకు తోచిన వైద్యం చేస్తున్నారు. మందులు ఇవ్వమన్నా సంబంధిత వైద్యాధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పశు పోషకులు వాపోతున్నారు. మూడు నాలుగు మండలాలకు ఒక వైద్యాధికారి ఉండటం, మందుల కొరత, చేసే వైద్యానికి కొందరు గోపాలమిత్రలు డబ్బులు వసూలు చేస్తుండటంతో గొల్లకుర్మలు, పశు పోషణపై ఆధారపడి జీవించే కర్షకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో గత్యంతరం లేక ప్రైవేటులో మందులు కొనుగోలు చేసి పశువులకు వైద్యం చేసుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా 19 పశు వైద్యశాలలు ఉండగా ఏడుగురు వైద్యులు ఉన్నారు. ఇందులో సైతం ఇద్దరు తాత్కాలిక వైద్యులే. 3,13,896 పశుసంపద ఉంది. ఇప్పటి వరకు 1510 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేయగా.. వాటి సంతానంతో పశుసంపద మరింత పెరిగింది. కౌటాల, సిర్పూర్(టి) మండలాల్లోనే దాదాపు 25 వేల గొర్రెలున్నాయి. నిత్యం వర్షాల కారణంగా ఈ జీవాలకు వివిధ రకాల రోగాలు వ్యాప్తిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పత్తి, కంది పంటలున్నాయి. మేతకు అనువైన జాగా లేకపోవడంతో వందలాది మేకలు, గొర్రెలను తీసుకుని గొల్ల కుర్మలు అడవిబాట పడుతున్నారు. కొండాకోనల్లో నెలల తరబడి ఉంటున్నారు.

గోపాలమిత్రల వసూళ్లు..

అన్ని మండలాల్లో 19 మంది గోపాల మిత్రలున్నారు. వీరు ఆయా క్లస్టర్ల పరిధిలో పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలి. వివిధ చికిత్సలు చేస్తున్న సందర్భంలోనూ కొన్ని ప్రాంతాల్లో ఒక్కో పశువుకు రూ.100 నుంచి రూ.200 వరకు తీసుకుంటున్నారు. ఒక్కో రైతు దగ్గర 50-100 వరకు గొర్రెలు ఉంటే భారీగా ఇచ్చుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. చాలా ప్రాంతాల్లో వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ఆసుపత్రుల్లో ఉండటం లేదని కర్షకులు వాపోతున్నారు.

శిబిరాలు ఏర్పాటు చేయాలి

అడవుల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని గొల్ల కుర్మలు మందలు మేపుతున్నారు. ఈ ప్రాంతంలో వారానికి ఒకసారైనా వైద్య శిబిరాలు నిర్వహించి జీవాలకు అవసరమయ్యే చికిత్సలు అందించాలని కోరుతున్నారు. రూ.వేలు ఖర్చు పెట్టి, తెలిసి, తెలియని వైద్యం చేస్తున్నామని జీవాలు నిత్యం ఒకటి రెండు చనిపోతున్నాయని, మందులు ఇవ్వమంటే కొన్నిచోట్ల డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కాపరులు ఆరోపిస్తున్నారు.

శిబిరాలు ఏర్పాటు చేస్తాం సురేశ్, జిల్లా పశువైద్యాధికారి

మూగజీవాలకు చికిత్సలు అందించడానికి జిల్లా వ్యాప్తంగా శిబిరాలు ఏర్పాటు చేస్తాం. వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. నియామకాల కోసం ఉన్నతాధికారులకు సంప్రదించాం. మందులు ఆసుపత్రుల్లో సరిపడా ఉన్నాయి.

'నిత్యం సూదులు వేస్తున్నాం.. రాజ్‌కుమార్, సిర్పూర్(టి)

మాకు గొర్రెలు, మేకలు కలిపి 54 వరకు ఉన్నాయి. వణకడం, పుర్రుకొట్టడం, ఏమీ తినకపోవడం, కదలకపోవడం వంటి రోగాలు వస్తున్నాయి. ప్రైవేటులో మందులు కొనుగోలు చేసి నిత్యం ఉదయం అన్ని గొర్రెలకు సూదులు వేస్తున్నాం. ప్రభుత్వ పశువైద్యశాలలో మందులను ఇవ్వడం లేదు.

మందుడబ్బా ధర రూ.1400 భీరయ్య, కౌటాల

సిర్పూర్(టి) సమీపంలో పది కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాం. కౌటాల మండలం శీర్షా నుంచి ఇక్కడికి వచ్చాం. డబ్బులు ఇవ్వనిదే పశువైద్యులు మందులు ఇవ్వడం లేదు. చేసేదేంలేక బయట రూ.1400 వెచ్చించి మందు తెచ్చి, నిత్యం గొర్రెలకు వేస్తున్నాం.

# పైపైకి పాతాళగంగ..

నిర్మల్ : జిల్లాలో.. జలాశయాలు, సాగునీటి కాలువలు, గొలుసు కట్టు చెరువులు ఉండి నీటి వనరులు పుష్కలంగా ఉన్న ఖిల్లాగా పేరుంది. ఇక్కడి నేలల్లోనూ నీరు ఇంకే స్వభావం ఉండటం భూగర్భ జలాలు పెరగడానికి కారణం. ప్రాజెక్టులు, చెరువులతో బోరుబావుల్లోనూ నీరు పుష్కలంగా ఉండటంతో.. మరో రెండేళ్ల వరకు సాగునీటి కష్టాలు ఉండవని కర్షకులు, భూగర్భ జలశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు జిల్లాలో 9.52 మీటర్లలో నీరుండగా.. సెప్టెంబరు నెలాఖరులో 3.57 మీటర్లలోనే ఉండటం గమనార్హం.

ఇదే మొదటిసారి..జిల్లాలో భూగర్భ జలాలు తరచూ తగ్గడం, మళ్లీ పెరగడం సాధారణం. ఈ వానాకాలంలో రికార్డు స్థాయిలో వర్షాలు కురవడం వల్ల గత పుష్కర కాలంలో లేనివిధంగా భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం 1046.56 మిల్లీమీటర్లు. సెప్టెంబరు మాసం వరకు 905 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా.. ఇప్పటివరకు 1,243 మి.మీ. కురిసింది. గతంలోనే ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఇప్పటికే 37 శాతం అధిక వర్షపాతం నమోదైంది. నాలుగు నెలల వ్యవధిలోనే భారీ వర్షాలు పడటంతో.. భూగర్భ జల వృద్ధి గణనీయంగా పెరిగింది. జిల్లాలో 3.57 మీటర్లలోనే పాతాళగంగ ఉండటంతో.. సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడే అవకాశం లేదు. నాలుగు నెలల నుంచి కురిసిన వర్షాలతో మెల్లమెల్లగా భూమిలోకి ఇంకడం వల్ల పెరుగుదల కనిపించింది. ఇలా చేస్తే మరింత ప్రయోజనం..



నీరు వృథా పోకుండా భూమిలోకి ఇంకించే ఏర్పాట్లు చేసుకోవాలి. ఇళ్ల పైకప్పు నుంచి కిందకు పడ్డ నీటి స్టోరేజీ ట్యాంకులు నిర్మించుకుని అందులోకి మళ్లించాలి. వ్యవసాయపరంగా పొలం చుట్టూ అరమీటరు వెడల్పు, మీటరు లోతులో కందకం తవ్వించాలి. ఇలా నీరు భూమిలోకి ఇంకిస్తే ఆ పొలంలో పండిస్తున్న పంటలు ఎండిపోకుండా తేమ రూపంలో నీరందుతుంది. రెండెకరాల పొలం ఉన్న రైతులు పది మీటర్ల భూమిలో రెండు మీటర్ల వెడల్పు, లోతు వరకు తవ్వి వర్షం నీటిని నిల్వ చేయాలి. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో కొత్త నీటి వనరులు ఏర్పాటు చేసుకోవాలి.

పొదుపుగా వాడుకోవాలి

ఈసారి వర్షాలు ఎక్కువగా పడటంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా పెరగడంతో నీటిని పొదుపుగా వాడుకోవాలి. ఎంత అవసరమో అంతే వినియోగించాలి. పంట పొలాలకు అవసరం మేరకు నీటిని ఉపయోగించాలి. నీరుంది కదా అంటూ వృథా చేస్తే మళ్లీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. నీటి ఇక్కట్లు ఏర్పడిన సమయంలో ప్రతి నీటి బిందువు ఎంత విలువైందో తెలుస్తుంది. ఆ నీటిని జాగ్రత్తగా వాడుకుంటే రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. శ్రీనివాసబాబు, భూగర్భ జలశాఖ ఉప సంచాలకుడు

# ఊపిరి పోసేదెన్నడు..?

కామారెడ్డి : దోమకొండలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ఆక్సిజన్ యూనిట్ సేవలు దూరంగానే ఉండిపోయాయి. ప్రత్యేకంగా విద్యుత్తు నియంత్రిక అవసరంపై అధికారులు దృష్టి సారించలేకపోవటంతో ప్రాణవాయువు యూనిట్ మనగడలోకి రాలేకపోతోంది. కొవిడ్ నేపథ్యంలో 2021లో అత్యవసర చికిత్సల్లో భాగంగా ఆక్సిజన్ యూనిట్ అవసరంగా భావించారు. అప్పట్లో దీని కోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధులు రూ.15 లక్షలు మంజూరు చేశారు.

ఐసీయూ తరహాలో ఏర్పాట్లు

ఆసుపత్రిలో 30 పడకలున్నాయి. 20 పడకలకి ఆక్సిజన్ పంపే మార్గం, పది పడకలకు గాలి వచ్చేలా, వసతులతో ఏర్పాట్లు చేశారు. ఐసీయూ తరహాలో రూపొందించారు. అవసరమైన పరికరాలు బిగించారు. ఆక్సిజన్ సరఫరాకు సంబంధించిన యూనిట్ పనులన్నీ పూర్తయ్యాయి. యంత్రాలు, జనరేటర్లకు షెడ్లను నిర్మించారు. ఈ యూనిట్ వాడుకలోకి వస్తే ఆసుపత్రిలో 100 ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉండేలా చొరవ చూపుతారు. పనులు పూర్తయి ఆరు నెలలు కావొస్తున్నా.. వాడుకలోకి రాలేదు. ఆక్సిజన్ స్థాయి తగ్గినట్లయితే రోగులను అంబులెన్స్‌లో ప్రస్తుతం జిల్లాకేంద్రానికి పంపిస్తున్నారు.



విద్యుత్తు నియంత్రిక అవసరం..

ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఆక్సిజన్ యూనిట్ వాడుకలోకి రావాలంటే ప్రత్యేకంగా విద్యుత్తు నియంత్రిక అవసరమని సాంకేతిక అధికారులు చెబుతున్నారు. 125 కేవీఏ విద్యుత్తు నియంత్రిక అవసరంగా నిర్ణయించారు. దీనికి విద్యుతు ఉన్నతాధికారులను వైద్య విధాన పరిషత్ అధికారులు సంప్రదించగా.. సంబంధించి స్థలాన్ని పరిశీలన చేశారు. ఆ నియంత్రిక ఏర్పాటుకు రూ.8.5 లక్షలు అవసరమని విద్యుత్తు అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రతిపాదనలను ఇక్కడి ఆసుపత్రి పర్యవేక్షకులకు స్థానిక విద్యుత్తు అధికారులు అందించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చొరవ చూపి, ప్రాణవాయువు యూనిట్‌ను వాడుకలోకి తేవాల్సి ఉంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తా– సంగీత్‌కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకుడు, సీహెచ్‌సీ, దోమకొండ ఆక్సిజన్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. దీనిని వాడుకలోకి తేవాలంటే 125 కేవీఏ విద్యుత్తు నియంత్రిక అవసరం. ఇందుకు గాను ట్రాన్స్‌కో అధికారులు పరిశీలన చేసి, సంబంధించిన ప్రతిపాదనల పత్రాలను అందించారు. వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తాను.

# ఏది సరైంది..?



| Month | Camp Date | Type of Disability | No. of Slots: New Assessment | No. of Slots: Temporary Assessment | Slot Opening Time | Booking Date & Time |
|---|---|---|---|---|---|---|
| September | 13.09.2023 | Orthopedic | 35 | 15 | | |
| | | Visual | 20 | 10 | | |
| | 14.09.2023 | ENT | 25 | 10 | | |
| | | MI & MR (Psychiatric) | 15 | 10 | | |
| Camp timing 9:00 AM to 12:00 PM | | | 95 | 45 | | |
| September | 20.09.2023 | Orthopedic | 35 | 15 | 09.09.2023 (11:00 AM) | |
| | | Visual | 20 | 10 | | |
| | 21.09.2023 | ENT | 25 | 10 | | |
| | | MI & MR (Psychiatric) | 15 | 10 | | |
| Camp timing 9:00 AM to 12:00 PM | | | 95 | 45 | | |
| October | 04.10.2023 | Orthopedic | 35 | 15 | | |
| | | Visual | 20 | 10 | | |
| | 05.10.2023 | ENT | 25 | 10 | | |
| | | MI & MR (Psychiatric) | 15 | 10 | | |
| Camp timing 9:00 AM to 12:00 PM | | | 95 | 45 | | |
| October | 18.10.2023 | Orthopedic | 35 | 15 | | |
| | | Visual | 20 | 10 | | |
| | 19.10.2023 | ENT | 25 | 10 | | |
| | | MI & MR (Psychiatric) | 15 | 10 | | |
| Camp timing 9:00 AM to 12:00 PM | | | 95 | 45 | | |
| November | 01.11.2023 | Orthopedic | 35 | 15 | | |
| | | Visual | 20 | 10 | | |
| | 02.11.2023 | ENT | 25 | 10 | | |
| | | MI & MR (Psychiatric) | 15 | 10 | | |
| Camp timing 9:00 AM to 12:00 PM | | | 95 | 45 | | |
| November | 22.11.2023 | Orthopedic | 35 | 15 | | |
| | | Visual | 20 | 10 | | |
| | 23.11.2023 | ENT | 25 | 10 | | |
| | | MI & MR (Psychiatric) | 15 | 10 | | |
| Camp timing 9:00 AM to 12:00 PM | | | 95 | 45 | Total 840 Slots | |

కామారెడ్డి : సదరం స్లాట్ బుకింగ్ వ్యవహారం గందరగోళంగా మారుతోంది. మూడు నెలలకు సంబంధించి మొత్తం స్లాట్లు విడుదల చేస్తున్నట్లు ఓసారి, మరోసారి కేవలం ఆ నెలలో నిర్వహించే శిబిరాల టోకెన్లు విడుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. ఏదీ సరైందో తెలియక దివ్యాంగులు తికమక పడుతున్నారు. స్లాట్లు బుక్ చేసుకోవాలని అధికారులు ప్రకటించిన రోజున ఉదయం నుంచే మీ–సేవ కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు. జిల్లాలో నిర్వహించే శిబిరానికి కేటాయించిన స్లాట్ బుకింగ్‌లు నిమిషంలోనే అయిపోతున్నాయి. ఆ తర్వాత సైట్‌ను మూసివేస్తున్నారు. దీంతో దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు.

ఏం జరిగిందంటే..

స్లాట్ బుకింగ్ సమస్యలు ఎదురుకావడం, ప్రతి నెల కేవలం 95 స్లాట్లు మాత్రమే విడుదల చేయడంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారనే కారణంగా అధికారులు మూడు నెలలకు సంబంధించిన స్లాట్లను ఒకేసారి విడుదల చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబరులో కూడా మూడు(సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు) నెలలకు గాను సదరం శిబిరాల తేదీలు ఖరారు చేశారు. దీనికి 840 స్లాట్లను విడుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ స్లాట్ల బుకింగ్‌ను సెప్టెంబరు 9వ తేదీన ఉదయం 11 గంటలకు మీ–సేవ కేంద్రాల్లో బుక్ చేసుకోవాలని సూచించారు. పత్రిక ప్రకటన కూడా జారీ చేశారు. దీంతో దివ్యాంగులు స్లాట్లు దొరుకుతాయనే ఆనందంతో మీ–సేవ కేంద్రాలకు ఉదయమే చేరుకుని నిరీక్షించారు. కానీ అక్కడ కేవలం నిమిషం వ్యవధిలోనే టోకెన్‌లు అయిపోయాయి. చాలా మంది దివ్యాంగులు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీవో కార్యాలయానికి చేరుకుని ఏం జరిగిందని వాకబు చేశారు. తెలియని వారు నిత్యం మీ–సేవ కేంద్రాలకు వెళ్లడం.. సైట్ ఓపెన్ చేశారా అని నిర్వాహకులను అడుగుతూ వచ్చారు. ఇదిలా ఉండగా సెప్టెంబరు 30వ తేదీన అక్టోబరులో నిర్వహించే సదరం శిబిరాలకుగాను టోకెన్లు బుక్ చేసుకోవాలని అధికారులు మళ్లీ పత్రిక ప్రకటన పంపారు. దీంతో ఈ గందరగోళం ఏంటని దివ్యాంగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ 1వ తేదీన కూడా మీ–సేవ కేంద్రాలకు వెళ్తే నిమిషం వ్యవధిలోనే స్లాట్లు బుక్ అయ్యాయని అసంతృప్తి చెందుతున్నారు. అధికారులు స్లాట్ల బుకింగ్ విషయంలో స్పష్టత లేని సమాచారం ఇవ్వడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటున్నారు.

మీ సేవ కేంద్రాలకు..సదరం శిబిరాలను నెలలో రెండుమూడు సార్లు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 120 మీ–సేవ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో సరాసరిగా ఐదారుగురు దివ్యాంగులు స్లాట్ బుకింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. సైట్ కూడా అధికారులు చూపించిన సమయానికి ఓపెన్ కావడం లేదని బాధితులు పేర్కొంటున్నారు. మీ–సేవతో సంబంధం లేకుండానే కొందరికి స్లాట్లు కేటాయిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. దివ్యాంగులకు ఒక నెల స్లాట్ బుక్ కాకుంటే మరో నెలలో ఇంకో మీ–సేవకేంద్రానికి పరుగులు పెడుతున్నారు. పట్టణాల్లోని మీ సేవల్లో త్వరగా స్లాట్లు బుక్ అవుతాయనే ధీమాతో మండలాల నుంచి వస్తున్నారు. వాస్తవానికి అన్ని మీ–సేవల్లోనూ బుకింగ్ ఒకే మాదిరి ఉంటుంది. ఇది తెలియక చాలా మంది దివ్యాంగులు డబ్బులు ఖర్చుపెట్టుకుని పట్టణాలకు వస్తున్నారు.

# రైలు వస్తున్న తరుణం..

సిద్దిపేట : జిల్లా వాసులకు తమ సొంత గడ్డ నుంచే రైలు ఎక్కే సమయం ఆసన్నమైంది. దశాబ్దాలుగా ఎదురుచూసిన కల.. నెరవేరేందుకు ఒకరోజు మాత్రమే మిగిలి ఉంది. రైలు కూత వినని ఈ ప్రాంత ప్రజలకు సాకారమవుతున్న తరుణాన ఆనందం వ్యక్తమవుతోంది. ఎప్పుడెప్పుడు ఆ తీపి క్షణాలను ఆస్వాదిద్దామని ఉవ్విళ్లూరుతున్న ఎంతోమందికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. మెదక్ జిల్లా మనోహరాబాద్ – కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మార్గంలో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వరకు పుష్ – పుల్ రైలు (డీజిల్ ఎలక్ట్రికల్ మల్టీపుల్ యూనిట్) సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నెల 3వ తేదీన మధ్యాహ్నం 3 గంటల తరువాత ప్రధాని మోదీ నిజామాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు అధికారవర్గాలు ప్రకటించాయి. ఈ మార్గంలో రెండు రైళ్లు రాకపోకలు సాగించేందుకు రైల్వే శాఖ తాజాగా పచ్చజెండా ఊపింది. మనోహరాబాద్ –కొత్తపల్లి మార్గం నాలుగు జిల్లాలను అనుసంధానించే కీలక మార్గం. పారిశ్రామిక అభివృద్ధికి ఇదో రాచబాట. రూ.1160.47 కోట్ల అంచనా వ్యయంతో 151.36 కి.మీలకు



వెచ్చిస్తూ.. 2019 సంవత్సరంలో ఈ నూతన మార్గాన్ని చేపట్టారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చొరవ, ప్రత్యేక కృషి ఫలితంగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో సిద్దిపేట వరకు రైల్వే పట్టాల నిర్మాణం 77 కి.మీ. మేర పూర్తయింది. మరో 17 కి.మీ. పూర్తయితే జిల్లా పరిధిలో పట్టాల అమరిక పూర్తవనుంది. 70 గ్రామాలు, పలు పుణ్యక్షేత్రాల మీదుగా వెళ్లే కీలక మార్గం (ఏక) కావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఎనిమిది కోచ్‌లు కలిగి ఉండే పుష్ పుల్ రైలులో ఏకకాలంలో దాదాపు వేయి మంది రాకపోకలు సాగించవచ్చు. సిద్దిపేట రైల్వేస్టేషన్ (నర్సాపూర్) పనులు దాదాపుగా పూర్తయ్యాయి.

తుది మెరుగులు దిద్దుతున్నారు. రెండు ప్లాట్‌ఫాంలు నిర్మించారు. ఇప్పటికే రైల్వే శాఖ అధికారులు సిద్దిపేట–దుద్దెడ వరకు పలు దశల్లో స్పీడ్ టెస్టును విజయవంతంగా నిర్వహించారు. గత నెలలో సన్నాహక పరుగు (ట్రయల్ రన్) పూర్తయింది. వివిధ దశల్లో పరిశీలన.. తనిఖీ ప్రక్రియ పూర్తయింది. రైల్వే సేఫ్టీ కమిషన్ అధికారులు.. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదం పలికారు. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ చేరుకునేందుకు రూ.60 ఛార్జీ విధించినట్లుగా తెలుస్తోంది.మల్లన్న దర్శనానికి మార్గం: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం.. ఎంతో ప్రాశస్త్యం కలిగి ఉంది. మల్లన్న దర్శనం నిమిత్తం రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రజలతో పాటు హైదరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆలయానికి స్టేషన్ మంజూరైన విషయం తెలిసిందే. టెండర్లు చేపట్టాల్సి ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో స్టేషన్ అందుబాటులోకి రానుందనేది ఒక అంచనా.

వారంలో ఆరు రోజుల పాటు..

తొలుత వారంలో ఆరు రోజుల పాటు సేవలు అందనున్నాయి. సిద్దిపేట నుంచి నగరానికి చేరుకోవాలంటే మూడు గంటలు, ఆపై సమయం పట్టే అవకాశం ఉంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి వస్తే సమయం కలిసి రానుంది.

రెండు పట్టణాల్లో క్రాసింగ్‌లు..

సిద్దిపేట నుంచి మొదలయ్యే రైలు.. దుద్దెడ, లకుడారం, కొడకండ్ల, గజ్వేల్, అప్పాయపల్లి (బేగంపేట), నాచారం, మనోహరాబాద్, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, బొల్లారం, క్యావల్రీ బ్యారక్స్, మల్కాజ్‌గిరి స్టేషన్‌ల మీదుగా ఆగుతూ సాగనుంది. రాజధాని పరిధిలో కాచిగూడ వరకు వెళ్లనుందని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుతం సిద్దిపేట, గజ్వేల్ వద్ద రైల్వే క్రాసింగ్‌లున్నాయి. భవిష్యత్తులో నాచారం, లకుడారం, దుద్దెడ వద్ద ఏర్పాటయ్యే అవకాశం ఉంది.గజ్వేల్ వరకు గూడ్స్ రైలు రాకపోకలు సాగిస్తున్నాయి. డిమాండ్ మేర సిద్దిపేట వరకు నడిపించనున్నారు.జిల్లా సరిహద్దుకు సమీపంలో గుర్రాలగొంది వద్ద స్టేషన్ నిర్మించనున్నారు. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించారు. పూర్తవగానే పనులు మొదలు కానున్నాయి.భవిష్యత్తులో సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూరు, ఇతర నగరాలకు రైలు సదుపాయం అందుబాటులోకి తేనున్నారు. ఇప్పటికే మంత్రి హరీశ్‌రావు రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి సదరు ప్రతిపాదనలు తీసుకెళ్లారు.

# నిధులు లేక.. పనులు సాగక!

సంగారెడ్డి : జడ్పీలో పాలక సభ్యులకు కేటాయించిన పనులు ఏడాదిలో పూర్తి చేయాల్సి ఉండగా ఆ దిశగా అమలు కావడం లేదు. బిల్లుల సమస్య వేధించడంతో పనుల ప్రగతిపై తీవ్ర ప్రభావం పడుతోంది. పనులు ప్రారంభిస్తే బిల్లులు వస్తాయా? రావా అనే అనుమానంతో పనుల్లో తాత్సారం జరుగుతోంది. ఇటీవల నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో నిధులు లేక పనులు చేయలేకపోతున్నామని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నిధులు మంజూరు చేస్తే ఆయా పనులు వేగంగా జరిగేందుకు ఆస్కారం ఉందని పాలక సభ్యులు వాపోతున్నారు. జడ్పీ పనుల్లో తాత్సారంపై ప్రత్యేక కథనం.

సగం పనులతో సరి

గతేడాదిలో 141 పనులు, ఈ ఏడాదిలో 165 పనులు ప్రగతిలో ఉన్నట్లు లెక్కలు నమోదు చేశారు. ఇందులో ఎన్ని ప్రారంభించని పనులు అనేది స్పష్టత లేకపోవడం గమనార్హం. గత రెండేళ్ల నుంచి ఆయా పనులను పరిశీలిస్తే.. సగం పనులు కూడా ఇంకా పూర్తికాకపోవడం గమనార్హం. పంచాయతీరాజ్ శాఖలో రూ.5 లక్షలు దాటితే టెండర్లు, అంతలోపు ఉంటే నామినేషన్‌పై పనులు కేటాయింపులు అమలు చేస్తుంటారు.

అందని బిల్లులు..!

హత్నూర మండలం కొన్యాల గ్రామంలో రూ.5లక్షలతో మట్టి దారి నిర్మాణానికి గతేడాది పనులు చేశారు. పన్యాలల్లోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి రూ.5లక్షలు ఖర్చు చేశారు. ఏడాది గడిచినా వీటికి ఒక్క పైసా విదల్చడం లేదు.

కొండాపూర్ మండలం తేర్పోల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు తట్టెడు మట్టి తీయలేదు.

2021–22లో న్యాల్‌కల్‌లోని మాణిక్‌నగర్ కాలనీలో సీసీ డ్రెయిన్ బాగుకు రూ.3లక్షల నిధులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు పనులు ఆరంభించలేదు.

రాయికోడ్ మండలంలో సింగీతంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల భవనం నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించారు. ఇప్పటి వరకు తట్టెడు మట్టి తీయలేదు.

వట్‌పల్లి మండలం దుద్యాలలో 2022–23లో అంగన్‌వాడీ భవనంలో ప్రహరీ నిర్మాణం, తాగునీటి సౌకర్యానికి రూ.5లక్షలు మంజూరు చేశారు. పనులు ఇంకా ప్రగతిలో ఉన్నట్లుగా అధికారులు పేర్కొనడం గమనార్హం.అందోల్ మండలం అక్సాన్‌పల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు భవనం నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయింపులు చేసినా ఇంకా పనులు ఆరంభించలేదు.

2022–23లో మనూర్‌లో హనుమాన్ మందిరం వద్ద సైడ్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.2.50లక్షల పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2021–22లో మనూర్‌లో జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ పరికరాల కొనుగోలుకు రూ.1 లక్ష నిధులు మంజూరు చేసినా ఒక్క పరికరం కొనుగోలు చేయలేదు.

కోహీర్ మండలంలో రూ.10లక్షలకు పైగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినా ప్రయోజనం లేదు.

చర్యలు తీసుకుంటాం‌సీహెచ్.ఎల్లయ్య, జడ్పీ సీఈవో, సంగారెడ్డి జడ్పీ పనులు వేగంగా చేసేలా చర్యలు తీసుకుంటాం. పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించి.. ఎక్కడ పనులు ప్రారంభానికి నోచుకోలేనివి? ఇతరత్రా కారణాలపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటాం. బిల్లుల సమస్య లేదు. ఎక్కడైనా ఉంటే వాటిని విచారిస్తాం. ఇప్పించేలా చూస్తాం.

# బడిలో పెరటితోట.. ప్రయోజనాలే నిండా



నిజామాబాద్ : జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో పెరటి తోటల పెంపకం కొనసాగుతోంది. అన్ని కేజీబీవీల్లో ఈ కార్యక్రమం చేపట్టాలని ఆదేశాలున్నా స్థలాభావం, సొంత భవనం లేకపోవడం తదితర కారణాలతో పూర్తిస్థాయిలో పట్టాలెక్కలేదు. కానీ, ప్రారంభించిన బడుల్లో మాత్రం సత్ఫలితాలిస్తోంది.

రెండు రకాల ఉపయోగాలు

పాఠశాలల్లో ఖాళీ స్థలాన్ని వృథాగా వదిలేయొద్దని, వీలైనంత పెరటితోటలు పెంచాలని అధికారులు కేజీబీవీల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలంలో నీరు, చెత్త చేరితే దోమలు వృద్ధి చెందుతాయని, విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని చైతన్యపరిచారు. స్పందించిన ప్రత్యేకాధికారులు విద్యాలయాల్లో ఖాళీ స్థలాలను శుభ్రం చేశారు. విత్తనాలు చల్లి ఆకుకూరలు, కూరగాయలు పెంచుతున్నారు. నిత్యం విద్యార్థినుల కోసం వండేవంటల్లో వీటిల్లో పండిన ఆకుకూరలు, కూరగాయలు వినియోగిస్తున్నారు. చాలా బడుల్లో రసాయనాలు లేకుండా తోటలు పెంచుతున్నారు. విద్యార్థులు వంతుల వారీగా వీటిని సంరక్షిస్తున్నారు. కలుపు మొక్కలు తొలగించి నీరందిస్తున్నారు.

సాగవుతున్న కూరగాయలుపంటల పెంపకంపై అవగాహన

బడుల్లో పెరటితోటల పెంపకంతో పరిసరాల పరిశుభ్రతతో పాటు తాజా, సేంద్రియ కూరగాయలు తీసుకోవడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. కాలక్షేపంతో పాటు పంటల సాగుపై క్షేత్రస్థాయి అవగాహన వస్తుంది. పంటల్లో వచ్చే చీడపీడలను ఉపాధ్యాయులు వివరించి, నివారణ మార్గాలు సూచించడంతో వ్యవసాయంపై పట్టు పెరుగుతుంది.

పోటీతత్వం పెంపొందించడం

ఒక్కో జాతి మొక్క సంరక్షణ బాధ్యత ఒక్కో తరగతి విద్యార్థులకు కేటాయిస్తారు. వాటికి నీరు పెట్టడం, కలుపుతీయడం, చీడపీడలు గుర్తించి ఉపాధ్యాయుల సాయంతో నివారించడం చేస్తారు. నిత్యం పాఠశాలలో బోర్డుపై ఆ రోజు వండిన కూరగాయలు ఏ తరగతి విద్యార్థులు సంరక్షించారనే వివరాలు రాస్తారు. ఫలితంగా బాలికల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వం నెలకొని మరింత శ్రద్ధగా తోటలు పెంచుతున్నట్లు ప్రత్యేకాధికారులు చెబుతున్నారు.

అన్ని పాఠశాలలకు విస్తరిస్తాం– వనిత, సెక్టోరియల్ అధికారిణి, నిజామాబాద్ప్రస్తుతం స్థలాభావం, పక్కా భవనాలు లేకపోవడంతో అన్ని పాఠశాలల్లో పెంపకం చేపట్టలేకపోయాం. ప్రత్యేకాధికారులందరికీ ఈ ఫలితాలు వివరించి, ఉన్న స్థలంలోనే మిగతావారు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

# తెవివిలో స్పోర్ట్స్ బోర్డు ఉందా..!

కామారెడ్డి :విశ్వవిద్యాలయానికి 'స్పోర్ట్స్ బోర్డు' తప్పనిసరి. ఉన్నత విద్యతో సమానంగా ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంచుతూ.. స్ఫూర్తి పెంపొందించాలి. కానీ, తెలంగాణ విశ్వవిద్యాలయంలో పరిస్థితి వేరేలా ఉంది. వర్సిటీ ఏర్పడి ఇన్నేళ్లు గడుస్తున్నా 'స్పోర్ట్స్ బోర్డు' లేదనే అంశాన్ని ప్రస్తావిస్తూ గతేడాది ఎట్టకేలకు అధికారులు మేల్కొని బోర్డు ఏర్పాటు చేశారు. ఇది జరిగి 20 నెలలు గడుస్తున్నా ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించలేదు.

నిధులు కరవు ప్రతి వర్సిటీలో స్పోర్ట్స్ బోర్డుకు ప్రత్యేక బడ్జెట్ ఉంటుంది. ఉస్మానియా, కాకతీయ వర్సిటీల్లో ఏటా దాదాపు రూ.కోటి, మహాత్మాగాంధీ, పాలమూరు వర్సిటీలు రూ.40 లక్షల వరకు కేటాయిస్తున్నాయి. ఈ నిధులతో క్రీడా మైదానం అభివృద్ధి, పరికరాల కొనుగోలు, అంతర్ యూనివర్సిటీ పోటీలకు వెళ్లే ప్రతి క్రీడాకారుడికి కిట్లు, రవాణా ఖర్చులు చెల్లిస్తారు. రాష్ట్రంలో మూడో పెద్ద వర్సిటీగా పేరున్న ఇక్కడ క్రీడలకు నిధులు ఇవ్వకపోవడం దురదృష్టకరం. వర్సిటీ తరఫున ఇతర ప్రాంతాల్లో నిర్వహించే టోర్నీలకు వెళ్లే వారికి బడ్జెట్ లేదని చేతులు దులుపుకొంటున్న దుస్థితి నెలకొంది. స్పోర్ట్స్ సర్టిఫికెట్ వస్తే ఉన్నత చదువులు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఉంటుందనే ఆశతో క్రీడాకారులే సొంతంగా ఖర్చులు భరిస్తూ టోర్నీలకు హాజరవుతున్నారు.

సాధారణ మైదానంతో సరి

యూజీసీ నిబంధనల మేరకు వర్సిటీలో 20–30 ఎకరాల్లో మైదానాలు ఉండాలి. తెవివి 577 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నప్పటికీ స్టేడియం లేకపోవడం దురదృష్టకరం. కేవలం సాధారణ మైదానంతో సరిపెడుతున్నారు. జిమ్ అసలే లేదు. స్టేడియం, జిమ్ ఏర్పాటుకు విద్యార్థులు ఏళ్లుగా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇండోర్ గేమ్స్‌కు చోటు లేకపోవడంతో నిజామాబాద్ కలెక్టరేట్,



నాగారంలోని మైదానాల్లో ఎంపికలు చేపడుతుంటారు.

క్రీడా కోర్సులేవీ..?

తెవివి సారంగాపూర్ ప్రాంగణాన్ని స్పోర్ట్స్ హబ్‌గా ఏర్పాటు చేయాలని గతంలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన ఒక్క కోర్సు వర్సిటీలో లేదు. ఓయూలో ఎం.పీఈడీ, కాకతీయలో బీ.పీఈడీ, ఎంపీఈడీ కోర్సులు ఉన్నాయి. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల్, కుమురంభీం ఆసిఫాబాద్, జగిత్యాల జిల్లాల్లో ఎక్కడా ఈ ఎడ్యుకేషన్ కోర్సులు అందుబాటులో లేవు. తెవివిలో వీటిని ప్రవేశ పెట్టాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది.త్వరలో ఏర్పాటు చేస్తాం..ఆచార్య యాదగిరి, రిజిస్ట్రార్ గతంలో స్పోర్ట్స్ బోర్డును నామమాత్రంగా ఏర్పాటు చేశారు. త్వరలోనే కొత్త బోర్డు కమిటీని ఏర్పాటు చేస్తాం. ఇప్పటికిప్పుడు క్రీడలకు నిధులు కేటాయించడం కుదరని పని. వచ్చే మార్చిలో ప్రభుత్వం వర్సిటీకి ఇచ్చే నిధుల్లో కొంత భాగం క్రీడలకు కేటాయించేలా చూస్తాం.

# రెవెన్యూ డివిజన్‌గా రామాయంపేట

మెదక్ : జిల్లా చరిత్ర పుటల్లో రామాయంపేట రెవెన్యూ డివిజన్ చేరింది. ఇదివరకు మూడు ఉండగా తాజాగా నాలుగుకు చేరాయి. డివిజన్ కోసం ఇక్కడి ప్రజలు రోజుల తరబడి రిలే నిరహార దీక్షలు చేపట్టగా గత నెల సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు నోటిఫికేషన్ వెలువడగా అభ్యంతరాల స్వీకరణకు 15 రోజులు గడువిచ్చారు. ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో నాలుగు మండలాలతో కలిపి డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంత్రి హరీశ్‌రావు డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం నూతన జిల్లాలను ఏర్పాటు చేసింది. మెదక్ పట్టణ కేంద్రంగా 2016లో ఇరవై మండలాలతో జిల్లా ఆవిర్భవించింది. ఆ సమయంలోనే మెదక్, నర్సాపూర్, తూప్రాన్ రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేశారు. ఇందులో మెదక్ ఇదివరకే డివిజన్ ఉండగా జిల్లా ఏర్పాటు సమయంలో నర్సాపూర్, తూప్రాన్ నూతనంగా ఏర్పడినవి. మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలో మెదక్, హవేలీఘనపూర్, పాపన్నపేట, రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాలు, నర్సాపూర్ పరిధిలో శివ్వంపేట, నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్, కొల్చారం మండలాలు, తూప్రాన్ పరిధిలో మనోహరాబాద్, వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట, నార్సింగి, తూప్రాన్ మండలాలున్నాయి. జిల్లా ఆవిర్భావ సమయంలో 20 మండలాలుండగా ఆ తర్వాత మాసాయిపేట ఏర్పడడంతో దానిని కూడా తూప్రాన్ డివిజన్‌లోకి చేర్చారు.

నెలల తరబడి ఉద్యమం 44వ జాతీయ రహదారిపై ఉన్న రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని స్థానికులు నెలల తరబడి ఉద్యమం చేపట్టారు. అఖిలపక్ష నాయకులు, వివిధ సంఘాలు దీక్షలు నిర్వహించారు. ఇదివరకు రామాయంపేట అసెంబ్లీ నియోజకవర్గం ఉండగా 2009లో రద్దు చేసి మెదక్ నియోజకవర్గంలో విలీనం చేశారు. నియోజకవర్గ కేంద్రం రద్దయినందున, కనీసం డివిజన్ ఏర్పాటు చేయాలని పలువురు ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలో ఆగస్టు 23న మెదక్ పర్యటన సమయంలో రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ బహిరంగ సభలో ప్రకటించి ప్రక్రియ పూర్తి చేశారు.




# అంతా ఓపెన్‌గానే జరిగింది.. దీనిలో స్కామ్ ఎక్కడుంది?

విజయవాడ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో వాదనలు కొనసాగాయి. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే, సీఐడీ తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

**అవినీతి చేసినట్లు ఆధారాలు చూపించలేదు: ప్రమోద్‌కుమార్ దూబే** – చంద్రబాబు తరఫున ప్రమోద్‌కుమార్ దూబే వాదిస్తూ "స్కిల్ కేసుతో చంద్రబాబుకు సంబంధం లేదు. రెండేళ్ల తర్వాత రాజకీయ కారణాలతో ఈ కేసులో ఇరికించారు. డిజైన్ టెక్ సంస్థతో ఇతర సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. చంద్రబాబు సీఎం హోదాలో మాత్రమే నిధులు మంజూరు చేశారు. ఒప్పందం ప్రకారం 40 సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 2లక్షల మందికి పైగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారు. అంతా ఓపెన్‌గానే జరిగింది.. ఇందులో స్కామ్ ఎక్కడుంది? చంద్రబాబు పాత్ర ఏముంది? ఇది పూర్తిగా రాజకీయ కక్షతో పెట్టిన కేసు. ఆయన అవినీతి చేసినట్లు ఆధారాలు కూడా చూపించలేదు. సీఐడీ కస్టడీలో విచారణకు చంద్రబాబు సహకరించారు. మరోసారి ఆయన కస్టడీ అవసరం లేదు.

విచారణ సాగదీయడానికే కస్టడీ పిటిషన్ వేశారు. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలి" అని కోర్టును కోరారు.

**బ్యాంకు లావాదేవీలపై విచారించాల్సి ఉంది: పొన్నవోలు** – సీఐడీ తరఫున పొన్నవోలు వాదనలు వినిపిస్తూ " ఒప్పందంలో ఉల్లంఘనలు జరిగాయి. కేబినెట్ నిర్ణయం మేరకు ఒప్పందం అమలు జరగలేదు. ఆ తప్పిదాలకు చంద్రబాబే బాధ్యుడు. బ్యాంకు లావాదేవీలపై ఇంకా ఆయన్ను విచారించాల్సి ఉంది. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ చంద్రబాబుకు అప్లై అవుతుంది. కస్టడీకి తీసుకుని మరిన్ని విషయాలు రాబట్టాల్సిన అవసరం ఉంది"అని చెప్పారు.

# చంద్రబాబు, పవన్ కలయిక విషతుల్యం: మంత్రి జోగి రమేష్




తాడేపల్లి: పెడనలో అటెన్షన్ ప్లే చేయాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ప్రయత్నించారని మంత్రి జోగి రమేష్ విమర్శించారు. సినిమా స్టైల్లో రాళ్లదాడి జరగబోతుందంటూ డైలాగులు వేశారని దుయ్యబట్టారు. తీరాచూస్తూ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మండిపడ్డారు. టీడీపీ, జనసేన కలిసినా రెండు వేలమందిని కూడా జనాన్ని తెచ్చుకోలేక పోయారని అన్నారు. పెడన ప్రజలను రౌడీలు అన్నందుకు పవన్ వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**వ్యాక్సిన్ కాదు అది వైరస్ :** కేవలం రెండు వేలమందితో కూడా సభ పెట్టుకోలేని పరిస్థితి ఏర్పడిందని మంత్రి విమర్శించారు. అవనిగడ్డలో ఫ్లాప్ షో నిర్వహించాని అన్నారు. టీడీపీ, జనసేన కలయిక వ్యాక్సిన్ కాదు అది వైరస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్, చంద్రబాబుక కలయిక విషంతో సమానమని అన్నారు. టీడీపీ, జనసేన కలిసిన తర్వాత మరింత దిగజారిపోయారని మండిపడ్డారు. రెండు చోట్లా ఓడిపోయిన పవన్ నిసిగ్గుగా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. పవన్‌కు సిగ్గు, మనసాక్షి లేదని విమర్శించారు.

**రౌడీలతో పోల్చుతావా పవన్? :** 'మీ వెకిలి వేషాలు చూశాక ప్రజలు నిర్ధారణకు వచ్చేశారు. 2014లో మీరు చేసిన స్కాంలను జనం చూశారు. దోచిన సొమ్ము షెల్ కంపెనీలకు పంపిన వైనాన్ని సీఐడీ బయట పెట్టింది. చివరికి చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో కూర్చున్నారున. అత్తారింటికి దారేది సినిమా ఎక్కడో పైరసీ జరిగితే మా పెడన కళంకారీ తమ్ముళ్లను పవన్ కొట్టించారు. కలంకారీ పరిశ్రమ దేశానికే గర్వకారణం. సీఎం జగన్ ప్రభుత్వం ఆ కళాకారులను గౌరవించి సత్కరించింది. అలాంటి వారిని రౌడీలతో పోల్చుతావా పవన్?

**కాపు ప్రజలకు దమ్ము, ధైర్యం ఉంది :** చంద్రబాబు పాలన అవినీతి రాజ్యం అంటూ గతంలో పవన్ మాట్లాడారు. టీడీపీ ప్రజాద్రోహి అన్నారు. పవన్ సీఎం కావాలంటే మా కులం బ్లడ్ ఎక్కించుకోవాలన్నారు. మొన్న రాజమండ్రి జైల్లో పవన్ ఆ కులం బ్లడ్ ఎక్కించుకున్నారా?. పవన్‌కు సిగ్గులేనందుక వారి బ్లడ్ ఎక్కించుకున్నారేమో?. కానీ కాపు ప్రజలకు దమ్ము, ధైర్యం ఉంది. పవన్ లాగ వ్యవహరించరు.

**టీడీపీ వారికి ఇదేం ఖర్మ! :** వంగవీటి రంగాని ఘోరంగా నరికి చంపిన వారికి పవన్ భుజాన వేసుకొని మోస్తున్నారు. మీలాంటివారిని ప్రజలు నమ్మరుకాక నమ్మరు. చంద్రబాబు, పవన్, ఎల్లోమీడియా, మరికొందరు బ్రోకర్లు పావలాలు పంచుకున్నారు. తెలుగుదేశం పార్టీ వారికి ఖర్మ పట్టింది. పవన్ వారాహి మీద మాట్లాడుతుంటే టీడీపీ నేతలు కొల్లు రవీంద్ర కింద నిలపడే ఖర్మ పట్టింది.

**పేదల పక్షాన జగన్, పెత్తందార్ల పక్షాన పవన్ :** పవన్ భారతీయుడో, రష్యావాడో తెలియదు. రష్యా వాడైతే ఏపీకి రావాలంటే కచ్చితంగా పాస్ పోర్టు కావాల్సిందే. పేదల పక్షాన జగన్, పెత్తందార్ల పక్షాన పవన్, చంద్రబాబు ఉన్నారు. చంద్రబాబు పని అయిపోయిందని పవన్ చెప్తున్నారు. టీడీపీ వారు ఇప్పటికైనా మైండ్ సెట్ మార్చుకోవాలి. చంద్రబాబు, పవన్ కలయిక అపవిత్రమైనది, ఒక విషబీజం లాంటిది. వీరి వలన ప్రజలకు నష్టమే తప్ప లాభం లేదు. 2024 తర్వాత పవన్‌తో నేను సినిమా తీస్తా. జానీ–కూలీ, గబ్బర్ సింగ్–రబ్బర్ సింగ్ పేరుతో సినిమా తీస్తా' అంటూ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు.

# ఢిల్లీ చేరుకున్న సీఎం జగన్.. స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు






ఢిల్లీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. రెండు రోజులు పర్యటనలో భాగంగా సీఎం జగన్ ఢిల్లీకి చేరుకున్నారు. ఇక, ఢిల్లీలో సీఎం జగన్‌కు ఎయిర్‌పోర్టులో వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భరత్, రెడ్డప్పా, అయోధ్య రామిరెడ్డి, బాలశౌరి, గోరంట్ల మాధవ్, రంగయ్యలు ఘన స్వాగతం పలికారు. కాగా, సీఎం జగన్ ఈరోజు సాయంత్రం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ బాకాయిలపై చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే, రేపు వామపక్ష తీవ్రవాదం నిర్మూలనపై జరుగుతున్న సదస్సులో సీఎం జగన్ పాల్గొననున్నారు. శుక్రవారం రాత్రి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సీఎం జగన్ సమావేశం కానున్నారు.



# కడపలో దారుణం.. భార్యాపిల్లలను చంపి.. ఆపై కానిస్టేబుల్ ఆత్మహత్య

కడప క్రైమ్: కడపలో దారుణం చోటుచేసుకుంది. స్థానిక కోపరేటివ్ కాలనీలో వెంకటేశ్వర్లు (50) అనే హెడ్ కానిస్టేబుల్ తన భార్య, ఇద్దరు పిల్లలను పిస్తోలుతో కాల్చి చంపి ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేశ్వర్లు ప్రస్తుతం కడప రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

బుధవారం రాత్రి 11 గంటలకు పీఎస్ నుంచి పిస్తోలు తెచ్చుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కానిస్టేబుల్ ఇలా చేయడానికి గల కారణాలపై ఆరా తీశారు. వ్యక్తిగత కారణాలతోనే వెంకటేశ్వర్లు ఆత్మహత్య చేసుకున్నట్లు కడప డీఎస్పీ షరీఫ్ చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# బుద్దా వెంకన్నకు 41ఏ నోటీసులు ఇచ్చి విచారించాలి




అమరావతి: తెలుగుదేశం ఉత్తరాంధ్ర జిల్లాల ఇంఛార్జ్ బుద్దా వెంకన్నకు సీఆర్పీసీలోని 41ఏ ప్రకారం నోటీసులు ఇచ్చి విచారించాలని ఏపీ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఇటీవల గన్నవరంలో జరిగిన సభలో ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, కొడాలి నానిలపై బుద్దా వెంకన్న అనుచిత వ్యాఖ్యలు చేశారని వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆత్కూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఈ కేసులో బుద్దా వెంకన్న హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో నమోదు చేసిన సెక్షన్‌లు అన్నీ ఏడు సంత్సరాలు శిక్ష పడేవిగా ఉన్నాయని వెంకన్న తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం... బుద్దా వెంకన్నకు సీఆర్పీసీలోని 41ఏ సెక్షన్ క్రింద నోటీసులు ఇచ్చి విచారించాలని హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

# మహిళా పక్షపాతి సీఎం వైయస్ జగన్ : మంత్రి ఆర్కే రోజా




తిరుపతి: ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. ఒక మగాడి విజయం వెనుక స్త్రీ ఉంటుంది.. కానీ, స్త్రీ విజయం వెనుక ఒక స్త్రీనే ఉంటుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు . పద్మావతి మహిళా యూనివర్సిటీ మహిళ సాధికారత సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. చరిత్రలో ఎవరు చేయని విధంగా మహిళల కోసం సీఎం వైయస్ జగన్ కృషి చేస్తున్నారని.. లక్షలాది మహిళల అకౌంట్స్‌లో నేరుగా కోట్లాది రూపాయల డబ్బులు వేస్తున్నారని ప్రశంసలు కురిపించారు. పాలు ఇచ్చే స్థాయి నుంచి పాలించే స్థాయికి దేశంలో మహిళలు ఎదిగారు.. 33 శాతం రిజర్వేషన్ల ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. రిజర్వేషన్ల ఇవ్వకుండానే ప్రపంచంలో ఎన్నో విజయాలు సాధించిన ఘనత మహిళలది.. విద్యా, సినిమా, రాజకీయాలు ఎక్కడైనా సరే.. మహిళలను వెనక్కి తరిమేసిలా ప్రయత్నం చేస్తుంటారని.. మనం చేస్తున్న పని తప్పా, ఒప్పా అని మనకు తెలుస్తే చాలు.. మహిళలు విమర్శలకు భయపడి పారిపోకూడదు.. పోరాటం మాత్రమే చేయాలని మంత్రి రోజా పిలుపునిచ్చారు. లింగ వివక్షత అనేది సమాజంలో ఉండకూడదు.. కొత్త జనరేషన్, యువతరం దానిని మార్చాలని మంత్రి రోజా కోరారు. సినిమా వాళ్లు బ్లూ ఫిలింలు చేస్తారని ఒక పనికి మాలిన వెధవ మాట్లాడు.. మనం చేస్తున్న పని తప్పా? కాదా? అని మనకు తెలిస్తే చాలు.. మన మనసాక్షికి తెలిస్తే చాలు.. ఎవరో ఏదో తిట్టారని భయపడి వెనక్కి అడుగు వేయకుండా ముందుకే వెళ్లాలన్నారు. మహిళల కోసం ఎంతో పోరాటం చేశాను.. ఉద్యమాలు చేశానని ఈ సందర్భంగా మంత్రి రోజా గుర్తుచేసుకున్నారు.

# టీడీపీ, జనసేన కాంబినేషన్ సూపర్ హిట్ అవుతుంది



విశాఖ: టీడీపీ, జనసేన కాంబినేషన్ సూపర్ డూపర్ హిట్ అవుతుందని.. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత గంటా శ్రీనివాస్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తర నియోజక వర్గంలో చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ తెలుగు దేశం శ్రేణులు విన్నూత రీతిలో నిరసన చేపట్టారు. సంకెళ్లు వేసుకుని టీడీపీ నేతల నిరసన తెలిపారు. దీనికి జనసేన నేతలు మద్దతు తెలిపారు. గంటా శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ రాష్ట్రంలోనే కాదు. దేశ, విదేశాల్లో వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ అరెస్టును గుర్తు చేస్తూ సింబలిక్‌గా జైల్ సెల్‌లో చేతికి సంకెళ్లు వేసుకుంటూ నిరసన తెలుపుతున్నాం. జగన్ ఆర్థిక నేరస్తుడు. 16 నెలలు జైల్లో ఉన్నారు. 10 సంవత్సారాల నుంచి బెయిల్ మీద ఉన్న వ్యక్తి.. 5 సంవత్సరాల నుంచి కోర్టు మెట్లు ఎక్కని వ్యక్తి జగన్. నిప్పులాంటి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. కుట్రలు, కుతాంత్రాలు చీల్చుకొని చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు, లోకేష్ యువగళం పాదయాత్రకు అడ్డంకులు సృష్టిస్తున్నారు." అని గంటా ధ్వజమెత్తారు.

# ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం సహా 16 మందిపై కేసు



నెల్లూరు: తెదేపా అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా బుధవారం నెల్లూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న తెదేపా, జనసేన, సీపీఐ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, తెదేపాకు చెందిన మాజీ మంత్రి సోమిరెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి సహా 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసులు నమోదైన నేతల్లో తెదేపాకు చెందిన పాశం సునీల్‌కుమార్, రామకృష్ణ, కంభం విజయరామిరెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎన్.సుబ్రహ్మణ్యం, మాలెపాటి సుబ్బనాయుడు, చేజెర్ల వెంటశ్వర్‌రెడ్డి, పొలంరెడ్డి దినేశ్‌రెడ్డి, గుమ్మడి రాజయాదవ్, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జనసేన నాయకుడు చెన్నారెడ్డి మాన్‌క్రాంత్‌రెడ్డి, సీపీఐ నేత దామ అంకయ్య ఉన్నారు. శాంతియుత ర్యాలీ నిర్వహణకు తొలుత తెదేపా నాయకులు అనుమతి కోరగా.. శాంతిభద్రతల దృష్ట్యా ఇవ్వలేమని పోలీసులు చెప్పారు. దాంతో పాటు నిరసనలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు అనుమతి ఇవ్వరని ముందే గ్రహించిన తెదేపా శ్రేణులు... ర్యాలీని విజయవంతం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. మంగళవారం రాత్రి నుంచే పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడ్డారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం రాత్రి నుంచే తన మొబైల్‌ను వదిలేసి దూరంగా ఉన్నారు. అనుచరులు, పార్టీ కార్యకర్తలను ముందుగానే సినిమా హాళ్లు, లాడ్జిల్లో నింపేశారు. సాయంత్రం నాలుగు గంటలకు తెదేపా నాయకులు వీఆర్సీ కూడలికి చేరుకునే ముందు బాణసంచా కాల్చడంతో వారంతా రోడ్డుపైకి వచ్చారు. దాంతో వీఆర్సీ కూడలి కిక్కిరిసిపోయింది. అనంతరం వీఆర్సీ కూడలి నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు.

# జాతీయ ఛానెల్స్‌లో పవన్‌పై న్యూస్.. జనసేనాని రియాక్షన్ ఏంటంటే?



అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్‌డీఏ నుంచి బయటకు వచ్చారంటూ జాతీయ న్యూస్ ఏజెన్సీల్లో వస్తున్న వార్తలు ఆ పార్టీలో కలవరాన్ని రేపుతున్నాయి. ఈ వార్తల సమాచారాన్ని మచిలీపట్నంలో ఉన్న పవన్ దృష్టికి జనసేన నేతలు తీసుకెళ్లారు. అయితే ప్రతీ వార్తకి ఎక్కడ స్పందిస్తామని జనసేనాని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. నిన్న (బుధవారం) పెడన సభలో తాను ఎన్‌డీఏ నుంచి ఒక అడుగు బయటకు వచ్చి టీడీపీతో పొత్తు పెట్టుకున్నానని పవన్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

# స్కిల్ డెవలప్‌మెంట్ కేసు.. చంద్రబాబు రిమాండ్ పొడిగింపు



విజయవాడ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన తెదేపా అధినేత చంద్రబాబు రిమాండ్‌ను ఏసీబీ కోర్టు పొడిగించింది. అక్టోబరు 19 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో రాజమహేంద్రవరం జైలులో ఉన్న చంద్రబాబుకు రెండో దఫా విధించిన రిమాండ్ గడువు గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో జైలు అధికారులు చంద్రబాబును వర్చువల్‌గా జడ్జి ఎదుట హాజరుపరిచారు. మరోవైపు జ్యుడిషియల్ రిమాండ్ పొడిగించాలంటూ ఏసీబీ కోర్టులో సీఐడీ మెమో దాఖలు చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఏసీబీ కోర్టు జ్యుడిషియల్ రిమాండ్‌ను రెండు వారాల పాటు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఇదే కేసులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. శుక్రవారం మధ్యాహ్నం ఇరుపక్షాల వాదనలు వింటామని ఏసీబీ కోర్టు వెల్లడించింది. ఈ రెండు పిటిషన్లపై రెండు రోజులపాటు సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే, సీఐడీ తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

# జగన్ అసమర్థత వల్లే కృష్ణా జాలాలపై ఏపీకి నష్టం

విజయవాడ: కృష్ణా జలాల మీద ఏపీ హక్కులను కాపాడాలన్న ప్రయత్నం చేసారా?.. ఇంటర్ స్టేట్ సమావేశం ఎప్పుడైనా పెట్టావా ? జగన్మోహన్ రెడ్డి ! అంటూ టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణా జలాలపై ఏపీ హక్కును కోల్పోతే రాయలసీమ ఏడారి అవుతుందన్నారు. "నువ్వు ముఖ్యమంత్రి అయిన పాపానికి రాయలసీమ ప్రజల గొంతు కోసావు. తాడేపల్లి కొంపలో పబ్జీ ఆడుకుంటూ చంద్రబాబు నాయుడుని జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నావ్. ముఖ్యమంత్రిగా నీ బాధ్యత నువ్వు నిర్వర్తించకుండా కనీసం ఇంటర్ స్టేట్ అధికారులు, సుప్రీం కోర్టులో మన న్యాయవాదులతో కేంద్రంపై ఎలా ఒత్తిడి తేవాలి అనే ప్రయత్నం చేయలేదు. ఆంధ్ర, తెలంగాణా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య జరగాల్సిన జలవివాదాన్ని నీ అసమర్థత వల్ల రెండు రాష్ట్రాలకే పరిమితం చేసినట్టుగా వార్తలొచ్చాయి. అసమర్థత, చేతగానితనం నీకు సోయలేకపోవడం వల్ల ఇవాళ కృష్ణాజలాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నష్టం జరిగింది. కేంద్రంలో 22 మంది ఎంపీలుండి గడ్డి పీకుతున్నారా? ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలి ?. ప్రత్యేక హెూదాకు దిక్కూ దివాణం లేదు, పోలవరం ప్రాజెక్టుకు డీపీఆర్ 2 ఆమోదించుకోలేకపోయారు.. గోదావరిలో ముంచేసారు రైల్వేజోన్ ఊసే లేదు, విద్యుత్ బోర్డు డబ్బులు గాలికి వదిలేసారు. నేను ఛాలెంజ్ చేస్తున్నా.. ముఖ్యమంత్రికి దమ్ము, ధైర్యం ఉంటే ఇవాళ ఢిల్లీ వెళ్తున్నావ్.. కృష్ణా జలాల మీద మన హక్కుల్ని, ప్రయోజనాలను ఎలా కాపాడావు. షెడ్యూల్ 9, 10 ఆస్తుల విభజన జరగాలి దానిపై ఢిల్లీలో మాట్లాడే దమ్ము, ధైర్యం ఉందా సమాధానం చెప్పాలి?" అంటూ దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు.

## దేవుని సొంత దేశంలో పుట్టి ఏమి ఈ అరాచకం?

ఐశ్వర్య లక్ష్మి పరిచయం అవసరం లేదు. మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్' సహా దుల్కార్ 'కింగ్ ఆఫ్ కోథ' వంటి భారీ పాన్ ఇండియా చిత్రాల్లో ఈ బ్యూటీ నటించింది. ఐశ్వర్య అందం, అద్భుత నట ప్రదర్శనకు ఇప్పుడు తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో భారీ ఫాలోవర్స్ ఉన్నారు. పెరిగిన క్రేజ్ కి తగ్గట్టే ఐశ్వర్య పలు భారీ సినిమాలకు సంతకాలు చేసిందని సమాచారం. ఇటీవలే లెజెండరీ మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియిన్ సెల్వన్ -1' వార్షికోత్సవం సందర్భంగా (30సెప్టెంబర్ 2022న విడుదలైన %ూా%-1) బోట్ గర్ల్ పూంగుజలి పాత్రను పోషించిన నటి ఐశ్వర్య లక్ష్మి ఇన్ స్టాలో ఒక త్రోబాక్ ఫోటోని షేర్ చేసింది. ది మణి సర్ స్క్వాడ్ పేరుతో రిలీజ్ చేసిన ఈ ఫోటోలో పీఎస్ 1 స్టార్లు అంతా ఉన్నారు. పొన్నియిన్ సెల్వన్ 1 దాదాపు 500కోట్లు వసూలు చేయగా సీక్వెల్ పొన్నియిన్ సెల్వన్ 2 ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 350 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. సుమారు 850కోట్లు వసూలు చేసిన ఫ్రాంఛైజీలో ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. అటుపై 'కింగ్ ఆఫ్ కోథ' ఆశించిన రిజల్ట్ ని ఇవ్వకపోవడం ఈ భామను నిరాశపరిచింది. అయినా ఐశ్వర్యకు



అవకాశాల పరమైన సమస్య లేదు. అటు తమిళం ఇటు తెలుగు రెండుచోట్లా అవకాశాలు వరిస్తున్నాయని సమాచారం. ఇంతలోనే ఐశ్వర్యలక్ష్మి లేటెస్ట్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఇది యువతరం గుండెల్లో గుబులు రేపుతోంది. ఐశ్వర్య లక్ష్మి పూర్తిగా లెదర్ డ్రెస్ లో సంథింగ్ హాట్ గా కనిపిస్తోంది. థై స్లిట్ బ్లాక్ డిజైనర్ గౌన్ ఈ భామ లోని హాట్ కంటెంట్ ని పదింతలు పెంచిందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. ఐషు పేరుతో ఉన్న ఇన్ స్టా పేజీలో ఐశ్వర్య లక్ష్మి స్వయంగా ఈ ఫోటోషూట్ ని షేర్ చేసింది. ఇది వెబ్ లో వేగంగా వైరల్ అవుతోంది.

**స్వగతం:** ఐశ్వర్య లక్ష్మి మలయాళ నటి. మలయాళం- తమిళం- తెలుగు పరిశ్రమలకు సుపరిచితం. 2017లో మలయాళ చిత్రం జందుకళుడే నత్తిల్ ఒరిడవేలాతో తొలిసారిగా నటించింది. మాయానది (2017), వరతన్ (2018), విజయ్ సూపరం పౌర్ణమియం (2019), అర్జెంటీనా ఫ్యాన్స్ కట్టూర్‌కడవు (2019)లో కనిపించింది. లక్ష్మి యాక్షన్ (2019)తో తమిళంలో అరంగేట్రం చేసింది. కెరీర్ లో ఒక ఫిలింఫేర్ సౌత్ అవార్డు, మూడు %ూ××పీూ% అవార్డులను గెలుచుకుంది. ఈ మల్లూ భామ దేవుని సొంత దేశం- కేరళలోని త్రివేంద్రంలో 6 సెప్టెంబర్ 1991న జన్మించింది. లక్ష్మి తన పాఠశాల విద్యను హోలీ ఏంజెల్స్ కాన్వెంట్ త్రివేంద్రంలో - త్రిస్సూర్‌లోని సేక్రేడ్ హార్ట్ కాన్వెంట్ గర్ల్స్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో చేసింది. 2017లో ఎర్నాకులంలోని శ్రీ నారాయణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుండి %వీదీదూ% డిగ్రీని పూర్తి చేసింది. అక్కడ తన ఇంటర్న్‌షిప్‌ను కూడా పూర్తి చేసింది. త్రివేంద్రం - కొచ్చిన్‌లలో తన కుటుంబీకులతో నివసిస్తుంది.

## బికినీ హొయలతో కపూర్ బ్యూటీ కన్నుల విందు

ఆహా కళ్యాణం అంటూ 2014 లో తెలుగు ప్రేక్షకుల ముందుకు నానితో కలిసి వచ్చిన ముద్దుగుమ్మ వాణి కపూర్. ఆ సినిమా నిరాశ పరచడం తో సౌత్ లో మళ్లీ వాణి కపూర్ కనిపించలేదు. బాలీవుడ్ లో కూడా ఎంట్రీ ఇచ్చి పదేళ్లు అవుతున్నా కూడా నటించిన సినిమాలు చాలా తక్కువ. ఈ మధ్య కాలంలో కాస్త జోరు పెంచిన వాణి కపూర్ సోషల్ మీడియా సెన్సేషన్ గా నిలుస్తోంది. వెండి తెరపై కంటే కూడా సోషల్ మీడియా ద్వారా ఎక్కువగా కనిపిస్తూ సందడి చేస్తున్న ముద్దుగుమ్మ వాణి కపూర్. ఈ మధ్య హిందీ సినిమాల్లో జోరు కనబర్చుతున్న వాణి కపూర్ సోషల్ మీడియాలో అంతకు మించి అన్నట్లుగా అందాల ఆరబోత చేస్తూ నెటిజన్స్ ని చూపు తిప్పుకోనివ్వడం లేదు అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఇటీవలే నెటిజన్స్ గొంతు తడి



ఆరిపోయేంత అందంగా స్కిన్ షో చేసిన వాణి కపూర్ ఈసారి బికినీ షో తో పిచెక్కిస్తోంది. బికినీ వేసుకుంటే నార్మల్ గానే చూపు తిప్పుకోకుండా చూడాలని అనిపిస్తుంది. అలాంటిది బికినీ లో హొయలు పోతూ మతి పోగొట్టినంత పని చేస్తుందని నెటిజన్స్ చర్చించుకుంటున్నారు. ఈ రేంజ్ లో అందంగా ఉన్న వాణి కపూర్ ను బాలీవుడ్ కానీ.. ఇతర వుడ్స్ కానీ ఇన్నాళ్లు ఎందుకు పట్టించుకోలేదు పాపం అన్నట్టు ఆమె పై అభిమానం కనబరుస్తున్నారు. మొత్తానికి వాణి కపూర్ ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బికినీ ఫోటోలను మీరు ఒక లుక్కేయండి.




## బాలీవుడ్ లో లాంచ్ అయితే బట్టలిప్పించేసారు! పాయల్ ఘోష్




పాయల్ ఘోష్ బాలీవుడ్ కెరీర్ ముగిసిన సంగతి తెలిసిందే. అమ్మడు తెలుగు.. కన్నడ...హిందీలో సినిమాలు చేసింది. కానీ ఏ భాషలోనూ నిలదొక్కుకోలేదు. బాలీవుడ్ లో కమిట్ మెంట్ పేరుతో లైంగిక దోపడీలపై సంచలన ఆరోపణలు చేయడంతో ఏకంగా పరిశ్రమకే దూరమైంది. ఆ వివాదంతో పాయల్ మళ్లీ బాలీవుడ్ లో కనిపించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి బాలీవుడ్ పై తనదైన శైలిలో విరుచుకు పడింది. 'దేవుడి దయవల్ల సౌత్ సినిమాల ద్వారా పరిశ్రమలోకి వచ్చాను. అలా కాకుండా ముందే బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చి ఉంటే నా దుస్తులు కూడా తొలగించేవారు. అలా చేసి నా పేరు మీద వ్యాపారం చేసుకు నేవారు. వాళ్లకి ప్రతిభతో పనిలేదు. దుస్తులు తీసేసి అమ్మాయిల అందాలు చూపిస్తే చాలు అని ఆరోపించింది. ఈ వ్యాఖ్యలు బాలీవుడ్ లో మరోసారి ఆసక్తికరంగా మారాయి. అమ్మడి వ్యాఖ్యలు బాలీవుడ్ ప్రతిష్టని మరింత దిగజార్చుతున్నాయి. బాలీవుడ్ లో కమిట్ మెంట్ వ్యవహారం ఎలా ఉంటుంది అన్నపై ఇప్పటికే చాలా మంది నటీమణులు సంచలన ఆరోపణలుచేసిన సంగతి తెలిసిందే. కంగనా రనౌత్ లాంటి నటి కూడా బాలీవుడ్ పై ఎప్పటికప్పుడు తనదైన శైలిలో విరుచుకుపడుతుంది. పాయల్ విషయంలో కంగన కూడా మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. మరి తాజాగా పాయల్ చేసిన ఆరోపణలపై ఎవరైనా స్పందిస్తారా? అన్నది చూడాలి. గతంలోనూ ఆమె చేసిన ఆరోపణల విషయంలో చాలా మంది మౌనంగానే ఉన్నారు.

కొంత మంది ఖండిచే ప్రయత్నం చేసే సరికి ఇరకాటం లోనూ పడ్డారు. పాయల్ ఘోష్ తెలుగు సినిమా 'ప్రయాణం'తో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'ఊసరవెల్లి'..'మిస్టర్ రాస్కెల్'..ఓ కన్నడ సినిమాలో నటించింది. అటుపై బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. అక్కడామే 'పటేల్ కి పంజాబ్ షాదీ' ..'కోయి జానే నా' లాంటి సినిమాలు చేసింది. ఆ తర్వాత ఆమె సినిమాలు చేసింది లేదు. బాలీవుడ్ పై ఆరోపణలతోనే మీడియాలో హాట్ టాపిక్ గా మారింది.

## బాలయ్య వర్సెస్ రవితేజ.. విజయ్ తట్టుకుంటాడా?




దసరాకి వారం రోజుల పాటు పండగ సెలవులు దొరుకుతున్నాయి. సంక్రాంతి తర్వాత తెలుగు రాష్ట్రాలలో చేసుకునే అతి పెద్ద పండుగలలో దసరా ఒకటి. అందుకే ఈఫెస్టివల్ టైంని కరెక్ట్ గా యూజ్ చేసుకోవడానికి స్టార్ హీరోలు తమ సినిమాలని బరిలోకి దించుతూ ఉంటారు. ఈ సారి దసరా బరిలో టాలీవుడ్ నుంచి రెండు సినిమాలు పోటీ పడుతున్నాయి. బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భగవంత్ కేసరి మూవీ అక్టోబర్ 19న థియేటర్స్ లోకి వస్తోంది. మాస్ మహారాజ్ రవితేజ టైగర్ నాగేశ్వరరావు పాన్ ఇండియా రేంజ్ లో అక్టోబర్ 20 ప్రేక్షకుల ముందుకి రానుంది. ఈ రెండు సినిమాలపైన భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రవితేజ టైగర్ రియల్ లైఫ్ రాబిన్ హుడ్ టైగర్ నాగేశ్వరరావు జీవిత కథతో తెరకెక్కుతోంది. ఇక బాలయ్య మూవీలో రావిపూడి స్టైల్ ఎంటర్టైన్మెంట్ తో పాటుగా బాలకృష్ణ స్టైల్ మాస్ అంశాలు పుష్కలంగా ఉండే కమర్షియల్ మూవీగా రాబోతోంది. ఈ రెండు సినిమాలపైన మంచి బజ్ ఉన్న నేపథ్యంలో ప్రేక్షకుల స్పందన కూడా గట్టిగానే ఉంది. అయితే ఈ సినిమాలతో పాటుగా ఇళయదళపతి విజయ్ లియో మూవీ కూడా అక్టోబర్ 19న రిలీజ్ కానుంది. తెలుగులో ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ వారు రిలీజ్ చేయనున్నారు. తెలుగు రైట్స్ ని భారీ ధరకి సొంతం చేసుకున్నారు. అయితే ఈ రెండు పెద్ద సినిమాల మధ్య లియో మూవీ ఏ మేరకు ఆడియన్స్ అటెన్షన్ గ్రాబ్ చేస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే లోకేష్ కనగరాజ్ గత సినిమాలు తెలుగులో కూడా మంచి కమర్షియల్ హిట్ అయ్యాయి. దీంతో లియో మీద కూడా బజ్ ఉంది. గతం శుక్రవారం వచ్చిన సినిమాలు పూర్తిగా తేలిపోయాయి. అక్టోబర్ 6న రిలీజ్ కాబోయే సినిమాలు కూడా లాంగ్ రన్ ఏ మేరకు ప్రభావం చూపిస్తయనేది చెప్పలేని విషయం. ఈ నెలలో దసరా బరిలో రిలీజ్ కాబోయే ఈ మూడు సినిమాలపైనే ఆడియన్స్ అటెన్సన్ అంతా ఉంది. మరి వీటిలో ఏది బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ అవుతుందనేది వేచి చూడాలి.

## అందంలో మామ్ రవీనాటాండన్‌ని మించి..!

హాట్ హీరోయిన్ రవీనా టాండన్ పరిచయం అవసరం లేదు. నందమూరి బాలకృష్ణ నటించిన బ్లాక్ బస్టర్ మూవీ 'బంగారు బుల్లోడు'లో ఒక కథానాయికగా నటించింది. దశాబ్దాల పాటు బాలీవుడ్ ని ఏలిన రవీనా ఇండస్ట్రీ హాటెస్ట్ హీరోయిన్ గా పాపులరైంది. నిరంతరం స్టార్ హీరోలతో ప్రేమాయణాలతోను ఈ భామ మీడియా హెడ్ లైన్స్ కెక్కింది. రవీనా ఇటీవలే కేజీఎఫ్ 2లో ఒక కీలక పాత్రలో నటించడం ఆసక్తిని కలిగింది. కేజీఎఫ్ ఫ్రాంఛైజీ తదుపరి చిత్రాల్లోను రవీనా కనిపించే వీలుంది. ఇప్పుడు రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ బ్యాక్ టు బ్యాక్ సినిమా ఆఫర్లతో ఇండస్ట్రీలో దూసుకుపోతోంది. ఇంకా డెబ్యూ ఇవ్వక ముందే 18 ఏళ్ల అమ్మాయి రెండు సినిమాల్లో నటించేస్తోందని సమాచారం. బాలీవుడ్‌లో ఆమన్ దేవగన్‌తో కలిసి



ఇంకా పేరు పెట్టని చిత్రంతో ఆరంగేట్రం చేస్తోంది. ఇందులో అజయ్ దేవగన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. దీనిని అధికారికంగా ప్రకటించకముందే ఇప్పటికే తన రెండవ సినిమా అవకాశాన్ని కైవసం చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం మేరకు రాషా టాలీవుడ్ లో ఆరంగేట్రానికి రెడీ అవుతోంది సమాచారం. అది కూడా పరిశ్రమ అగ్రహీరో సరసన తెరకు పరిచయమయ్యే అవకాశం ఉందని కథనాలొస్తున్నాయి. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తదుపరి చిత్రం %=జ% 16 తో రవీనా కుమార్తె రాషా తెలుగులో అడుగుపెడుతుందని తెలిసింది. %===% స్టార్ చరణ్ తో ఉప్పెన దర్శకుడు బుచ్చి బాబు సనా స్పోర్ట్స్ డ్రామాను తెరకెక్కించనున్నారు. ఈ చిత్రంలో రాషా ఒక ముఖ్యమైన పాత్రలో నటించవచ్చని ఊహాగానాలు సాగుతున్నాయి. అయితే రాషా కానీ ఆమె కుటుంబ సభ్యులు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే ఈ రెండు సినిమాలు నిర్మాణ దశలో ఉన్నాయి. మేకర్స్ తమ తారాగణం వివరాల్లో రాషా గురించి ప్రకటించే వీలుందని టాక్ వినిపిస్తోంది. ఈ అమ్మాయి ఇప్పటికే సోషల్ మీడియాలో పాపులర్ అయింది. ఇటీవలే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఈ యంగ్ గాళ్ ఎంతో గొప్ప ప్రతిభావంతురాలిగా పేరు తెచ్చుకుంది. రాషా కాలేజీ ఈవెంట్‌లో పాడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## 'దంగల్' బ్యూటీ ఇన్ స్టాలో దరువేస్తోందిగా!

బాలీవుడ్ యంగ్ బ్యూటీ సన్యా మల్హోత్రా ఇన్ స్టా క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు ఎప్పటికప్పుడు హీటెక్కించే ఫోటోలతో నెట్టింట హాట్ టాపిక్ గా మారుతుంది. డిజైనర్ దుస్తుల్లో సొగసరి తనని తాను చక్కగా ఫోకస్ చేసుకుంటుంది. నిత్యం ఏదో రీల్ తో ఇన్ స్టాలో హల్చల్ చేస్తూనే ఉంటుంది. తాజాగా బ్యూటీ మరో రీల్ తో ముందుకొచ్చేసింది. మిరుమిట్లు గొలిపే డిజైనర్ దుస్తుల్లో ఓ హిందీ పాటకి డాన్సు చేసింది. బ్యూటీ ఎలివేషన్ల సంగతి పక్కనబెడితే డిజైనర్ డ్రెస్ లో మాత్రం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. మిరుమిట్లు గొలిపే డిజైన్ సన్యా స్కిన్ టోన్ ని మరింత ప్రకాశవంతం చేస్తుంది. అమ్మడి మ్యాకప్ ..యాక్సరసీస్ సన్యాని మరింత అందంగా ఎలివేట్



చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అమ్మడి అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. ఇక బ్యూటీ కెరీర్ సంగతి చూస్తే దేదీప్య మానంగా సాగిపోతుంది. 'దంగల్' సక్సెస్ తో వరుస అవకాశాలతో బిజీ అయింది. ఇంతకాలం ఏడాదికి ఒక సినిమా చేసిన బ్యూటీ 2023 లో మరింత స్పీడప్ అయింది. ఇటీవలే 'జవాన్' తో భారీ విజయం ఖాతాలో వేసుకుంది. దీంతో 1000 కోట్లు వసూళ్లు దాటిన సినిమా మరోకటి సన్యా ఖాతాలో పడింది. దంగల్..తర్వాత జవాన్ తోనే ఆ ఫీట్ సాధించింది. ప్రస్తుతం 'సామ్ బహదూర్' ..'ది గ్రేట్ ఇండియన్ కిచెన్' రిమేక్ లోనూ నటిస్తోంది. అమ్మడు ఈ రెండు సినిమాలపై చాలా ఆశలు పెట్టుకుంది. రెండు డిఫరెంట్ చిత్రాలు. వాటిలో సన్యా పాత్ర వైవిధ్యంగా ఉంటుందని యూనిట్ అంటోంది. ఇప్పటికే ఈ రెండు సినిమాల షూటింగ్ కూడా పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.




హైదరాబాద్: తెలంగాణలో 2022-23 ఏడాదిలో 22 లక్షలకుపైగా ఓట్లను పరిశీలించి తొలగించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. శాసనసభ ఎన్నికల సన్నాహకాలపై సమీక్ష కోసం రాష్ట్రానికి వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం పర్యటన ముగిసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ (సీఈసీ) ఇతర కమిషనర్లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఆయన వెల్లడించారు. "తెలంగాణలో స్త్రీ, పురుష ఓటర్లు దాదాపు సమానంగా ఉండటం శుభపరిణామం. సమాజంలోని అన్ని వర్గాలను ఓటింగ్‌లో భాగస్వామ్యం చేస్తున్నాం. యువ ఓటర్ల సంఖ్య 8 లక్షలు దాటడం ప్రశంసనీయం. రాష్ట్రంలో 2022 - 23 ఏడాదిలో 22 లక్షలకుపైగా ఓట్లను పరిశీలించి తొలగించాం. ఏకపక్షంగా ఓట్లను తొలగించలేదు. ఫామ్ అందిన తర్వాతే తొలగించాం. అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యాం. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావంపై కొన్ని పార్టీలు ఆందోళన వెలిబుచ్చాయి. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరగొచ్చని కొన్ని పార్టీలు ఆందోళన చెందాయి. బుధవారం ఓటర్ల తుది జాబితా కూడా వెల్లడించాం. జులై తర్వాత దరఖాస్తు చేసుకున్న 2.21 లక్షల యువతకు ఓటు హక్కు కల్పించాం. 66 నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. 18 - 19 ఏళ్ల యువ మహిళా ఓటర్లు 3.45 లక్షల మంది ఉన్నారు. తెలంగాణలో తొలిసారిగా 80 ఏళ్లు దాటిన వారు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం పోలింగ్ స్టేషన్‌లు 35,356 ఉండగా.. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో సగటు ఓటర్ల సంఖ్య 897గా ఉంది. ఫిర్యాదుల స్వీకరణ కోసం సీ విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం" అని రాజీవ్‌కుమార్ వివరించారు.




# ఎన్నికలే లక్ష్యంగా భాజపా 14 కమిటీలు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం కమిటీలను ప్రకటించింది బీజేపీ. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని నియమిస్తూ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం మొత్తం 14 కమిటీల్ని ప్రకటించింది బీజేపీ. ఇందులో భాగంగా.. రాజగోపాల్‌రెడ్డికి కీలక బాధ్యతలు అప్పజెప్పింది. పబ్లిక్ మీటింగ్ కమిటీ ఇంఛార్జ్‌గా బండి సంజయ్, మ్యానిఫెస్టో, పబ్లిసిటీ కమిటీలకు చైర్మన్ గా గడ్డం వివేక్ వెంకటస్వామి, ఛార్జ్‌షీట్ కమిటీ చైర్మన్‌గా మురళీధర్‌రావు ఎంపిక చేసింది. వీటితో పాటు.. అజిటేషన్ కమిటీ(నిరసనలు, ఆందోళన నిర్వహణల బాధ్యతలు) చైర్మన్ గా విజయశాంతి, ప్రభావిత వ్యక్తులను కలిసే కమిటీ చైర్మన్ గా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎన్నికల కమిటీ చైర్మన్గా మర్రి శశిధర్ రెడ్డి, సోషల్ మీడియా కమిటీ చైర్మన్ గా ధర్మపురి అర్వింద్‌లకు బాధ్యతలు అప్పజెప్పింది. పొంగులేటి సుధాకర్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు రామచందర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డిలు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలకు సైతం కమిటీలలో చోటు కల్పించారు. తెలంగాణను ఆరు జోన్లుగా విభజించుకుని.. ఎన్నికల వ్యూహాలు అమలు చేయాలని కమలం భావిస్తోంది. ఈక్రమంలోనే.. ఇవాళ నేడు సంస్థాగత కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సునీల్ బన్సల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇంఛార్జిలు, రాష్ట్ర పదాధికారులు పాల్గొంటారు. వెయ్యి మందికి పైగా ఈ సమావేశాలకు హాజరవుతారని అంచనా. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బహిరంగ సభలకు ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ తరపున గెలిచిన వాళ్లు భాజపాలోకి జంప్ అవుతారు: కేటీఆర్



షాద్‌నగర్: అధికారం ఇచ్చినపుడు ప్రజలకు ఏమీ చేయని కాంగ్రెస్ పార్టీ.. ఇవాళ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ విమర్శించారు. హామీలతో ప్రలోభపెట్టాలని ఆ పార్టీ చూస్తోందని ఆరోపించారు. మోసాన్ని మోసంతోనే జయించి.. ఓటు భారాస అభ్యర్థులకు వేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "భాజపా వాళ్లకు అదానీ నుంచి బాగా పైసలు వస్తున్నాయట. కాంగ్రెస్, భాజపా వాళ్లను దబాయించి పైసలు అడగండి. రైతుబంధు అందితేనే.. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు వస్తేనే మాకు ఓటేయండి. తొమ్మిదేళ్లలో ఎన్నో మంచి పనులు చేసుకున్నాం. షాద్‌నగర్‌కు నీళ్లు ఇచ్చేది కేసీఆర్.. తెచ్చేది అంజయ్య యాదవ్. కాంగ్రెసోళ్లు కడుపులో గుద్ది.. నోట్లో పిప్పర్‌మెంట్ పెడతారు. భాజపా వాళ్లు నీళ్ల వాటా తేల్చరు.. కాంగ్రెస్ వాళ్లు ప్రాజెక్టులపై కేసులేసి ఇబ్బంది పెడతారు. రేవంత్‌రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ మనిషి అని కాంగ్రెస్ నేతలే చెప్పారు. ఈ విషయంపై పంజాబ్ మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్‌సింగ్ సోనియాగాంధీకి లేఖ రాశారు. రేవంత్ భాజపాతో కలిసి పోయారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లు భాజపాలోకి జంప్ అవుతారు" అని కేటీఆర్ విమర్శించారు.

**రాష్ట్రంలో శ్వేతవిప్లవం రావాలి:** తెలంగాణలో పాడి రైతులకు రూ.350 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. రూ.21 వేల కోట్లతో రైతుల రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో రోజుకు 8 లక్షల లీటర్ల శుద్ధి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన తెలంగాణ విజయ ఫెడరేషన్‌కు చెందిన మెగా డెయిరీని కేటీఆర్ ప్రారంభించారు. ఈ డెయిరీతో యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుబంధు కింద రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్లు జమచేసినట్లు గుర్తు చేశారు. "రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రధాని మోదీ గొప్పగా చెప్పారు. ఆయన చర్యల వల్ల ఆదాయం పెరిగిందా? కేంద్రం పెంచిన డీజిల్ ధరలతో రైతుల ఖర్చు రెట్టింపు అయింది. రాష్ట్రంలో మాత్రం సీఎం కేసీఆర్ చర్యల వల్ల వ్యవసాయం పండగలా మారింది. వరి దిగుబడిలో పంజాబ్‌ను అధిగమించాం. చేపల పెంపకం, వృద్ధిలో తెలంగాణ ముందుందని కేంద్రమే చెబుతోంది. రాష్ట్రంలో మహోన్నతమైన శ్వేతవిప్లవం రావాలి. ఈ పదేళ్లలో రాష్ట్రంలో ఎన్ని మార్పులు వచ్చాయో ప్రజలు ఆలోచించాలి. ఏదైనా రంగంలో తెలంగాణ వెనక్కిపోయిందేమో ప్రజలు గమనించాలి." అని కేటీఆర్ అన్నారు.

# తెలంగాణలోని ప్రముఖ ఆలయాలకు ఐటీ శాఖ నోటీసులు



రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట: తెలంగాణలోని పలు ప్రముఖ దేవాలయాలకు ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేసింది. ఆదాయపు పన్ను కట్టాలంటూ కొమురవెల్లి, రాజన్న, బాసర ఆలయాలకు నోటీసులు పంపించింది. ఈ జాబితాలో కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయం తొలి స్థానంలో ఉంది.

రూ. 8 కోట్ల ట్యాక్స్ కట్టాలని, సకాలంలో పన్ను కట్టనందువల్ల మరో రూ. 3 కోట్ల జరిమానా కూడా చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఐటీ రిటర్న్‌లు, 12ఏ రిజిస్ట్రేషన్ గడువు గత నెల 30వ తేదీతో ముగిసింది. రిటర్న్స్, 12ఏ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో ఈ నోటీసులను జారీ చేశారు. అదే విధంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి కూడా ఐటీశాఖ నోటీసులు జారీచేసింది. లెక్క ప్రకారం ఆదాయ పన్నును చెల్లించాలంటూ నోటీసులు పంపించింది. ఇక బాసరలోని సరస్వతి అమ్మవారి ఆలయంతో పాటు ఇంకా పలు దేవాలయాలకు కూడా నోటీసులు అందాయి. మరోవైపు ఆలయాలకు ఐటీ నోటీసులు ఇవ్వడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార సంస్థలు, వ్యక్తుల విషయంలో వ్యవహరించినట్టు ఆలయాలపై కఠిన వైఖరిని అవలంబించడం సరైన విధానం కాదని అంటున్నారు. పన్నులు ఎగ్గొట్టే వ్యాపారులను వదిలిపెట్టి ఆధ్యాత్మిక కేంద్రమైన దేవాలయాకు పన్ను కట్టాలని నోటీసులు ఇవ్వడంపై తీవ్రంగా మండిపడుతున్నారు.

# పార్టీలకు అతీతంగా డబుల్ ఇండ్ల పంపిణీ: మంత్రి తలసాని




మేడ్చల్: పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. పార్టీలకు అతీతంగా ఇండ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా కొర్రెములలో 720 మంది లబ్ధిదారులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రూ.10 వేల కోట్ల వ్యయంతో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించామన్నారు. అంతకుముందు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో 200 మంది లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను మంత్రి తలసాని అందజేశారు. కులవృత్తుల వారికి అండగా నిలుస్తున్న బీసీ బంధు ఇస్తున్న ఒకేఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్ అని చెప్పారు. బీసీలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్న కేసీఆర్ సర్కార్‌కు మద్దతు పలకాలని కోరారు. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఈనెల రెండో వారంలో తెలంగాణకు రాహుల్ గాంధీ



హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ వేడి పెరిగింది. ప్రధాని మోదీ, అమిత్ షా, సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్ ఇలా అగ్ర నేతల రాకతో రసవత్తర రాజకీయానికి తెలంగాణ వేదికగా మారింది. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తెలంగాణకు రారున్నారు. ఈనెల రెండో వారంలో తెలంగాణలో అడుగుపెట్టనున్న రాహుల్.. మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. రాహుల్ పర్యటనకు టీ కాంగ్రెస్ కార్యక్రమాలు సిద్ధం చేస్తోంది. ఇక ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీగా ఈసారి ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణలో అధికారాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇటీవలె హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశం, కాంగ్రెస్ విజయభేరి పేరుతో భారీ సభ నిర్వహించిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరిగిన ఈ సభలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ హామీలను ప్రకటించింది. అధికారంలోకి వచ్చేది తామేనని.. ఆ వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించింది. తుక్కుగూడ సభ అనంతరం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. మరోవైపు త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలోప్రధాన పార్టీలన్నీ రంగంలోకి దిగుతున్నాయి.

ఇప్పటికే అభ్యర్థులు ప్రకటించిన బీఆర్ఎస్ అభివృద్ధి పనులతో పాటు ప్రచారంపై కూడా దృష్టిపెట్టింది. ఇక జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ పక్కాగా వ్యూహాలను రచించే పనిలో ఉన్నాయి.




# వైద్యవ్యవస్థలో విప్లవం సృష్టించిన తెలంగాణ: మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట: వైద్య వ్యవస్థలో తెలంగాణ ప్రభుత్వం ఒక విప్లవం సృష్టించిందని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఒకప్పుడు డబ్బులు ఉన్నవాళ్లే డాక్టర్లు అయ్యేవారని, కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతులు, కూలీల పిల్లలు కూడా వైద్యులు అవుతున్నారని చెప్పారు. సిద్దిపేటలో నిర్మించిన వెయ్యి పడకల ప్రభుత్వ దవాఖానను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గాంధీ, ఉస్మానియా హాస్పిటళ్లలో ఉన్న సేవలు సిద్దిపేటలోనూ అందుబాటులోకి వచ్చాయన్నారు. గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలు సిద్దిపేటలోనే చేసుకోవచ్చని చెప్పారు. రూ.15 కోట్లతో క్యాన్సర్ బ్లాక్‌కు శంకుస్థాపన చేశామన్నారు. దవాఖానలో 15 ఆపరేషన్ థియేటర్లు న్నాయని చెప్పారు. నాలుగో ఫ్లోర్‌లో 100 ఐసీయూ బెడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 30 ఎమర్జెన్సీ బెడ్స్ ఉన్నాయన్నారు. ఇకపై వైద్య సేవలకు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. సిద్దిపేటలో డయాలసిస్ బెడ్లు 40 పెంచుతున్నామని వెల్లడించారు. రూ.23 కోట్లతో సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నిరకాల వ్యాధులకు సిద్దిపేటలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. స్టాఫ్ నర్సులను నర్సింగ్ ఆఫీసర్ అని పిలిచేలా జీవో ఇచ్చామని వెల్లడించారు.

# నల్లగొండ జిల్లాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ : జిల్లాలోని మిర్యాలగూడ నియోజకవర్గం మాడ్గులపల్లి మండలం పరిధిలో పంచాయత్ రాజ్ శాఖ నిధులు 60 లక్షల రూపాయలతో కుక్కడం గ్రామం నుంచి పూసలపహాడ్ గ్రామం వరకు 3.8 కిలోమీటర్ల మేర నూతన రోడ్ నిర్మాణ పనులకు గురువారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్థానిక శాసన సభ్యుడు నల్లమోతు భాస్కర్ రావుతో కలిసి శంకుస్థాపన చేసారు. అనంతరం గ్రామ సర్పంచ్ అలుగుబెల్లి గోవింద్ రెడ్డి అధ్వర్యంలో 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే భాస్కర్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుక్కడం గ్రామానికి అనేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోకల శ్రీవిద్య రాజు, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, మండల పార్టీ అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, పాక్స్ చైర్మన్ జెర్రిపోతుల రాములు గౌడ్, మాజీ ఎంపీటీసీ పుట్ట పద్మ, గుడే సత్యనారాయణ శర్మ, రాబర్ట్, జానయ్య, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం : మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం : సీఎం కేసీఆర్, రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సహాయ, సహకారాలతో ఖమ్మం నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామనిరవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తి చేసుకున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో పలువురు లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందించారు. పలుచోట్ల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో మాట్లాడారు. ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధికి నిబద్ధత, చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 2 వేల మందికి డబుల్ బెడ్ రూం ఇండ్లు అప్పగించామన్నారు. అలాగే అర్హులైన వారికి గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి జీవో 58 ప్రకారం ఇండ్ల పట్టాలు అందజేస్తున్నామన్నారు. నగరంలోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందిస్తున్నామన్నారు. గతంలో నగరంలో తీవ్ర నీటి ఎద్దడి ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే నీటి సమస్యకు పరిష్కారం దొరికిందన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ మహానగరం తర్వాత అంతటి ప్రగతి సాధించిన నగరం ఒక్క ఖమ్మమేనని స్పష్టం చేశారు. మున్ముందు మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఖమ్మం నగర మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# తెలంగాణలో 80 ఏండ్లు దాటిన ఓటర్లకు శుభవార్త.. ఇంటి నుంచే ఓటేసేందుకు అవకాశం..

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా 80 ఏండ్లు దాటిన వారు ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాలపై సమీక్ష కోసం రాష్ట్రానికి వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం పర్యటన గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఇతర కమిషనర్లతో కలిసి హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఎఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో స్త్రీ, పురుష ఓటర్లు దాదాపు సమానంగా ఉండటం శుభ పరిణామం అని పేర్కొన్నారు. యువ ఓటర్ల సంఖ్య 8 లక్షలు దాటడం ప్రశంసించదగ్గ విషయమన్నారు. 2022-23 ఏడాదిలో 22 లక్షలకు పైగా ఓట్లను పరిశీలించి తొలగించినట్లు తెలిపారు. ఏకపక్షంగా ఓట్లను తొలగించలేదని స్పష్టం చేశారు. ఫామ్ అందిన తర్వాతే ఓట్లను తొలగించినట్లు పేర్కొన్నారు. జులై తర్వాత దరఖాస్తు చేసుకున్న 2.21 లక్షల యువతకు ఓటు హక్కు కల్పించామన్నారు. 66 నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 18 నుంచి 19 ఏండ్ల యువ మహిళా ఓటర్లు 3.45 లక్షలు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం పోలింగ్ స్టేషన్లు 35,356 ఉండగా, ఒక్కో పోలింగ్ స్టేషన్లో సగటు ఓటర్ల సంఖ్య 897గా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఆయా పార్టీల సూచనలు, సలహాలను స్వీకరించామన్నారు. ఎన్నికల ఖర్చు పెంచాలని కొందరు అడిగారని చెప్పారు. ఫిర్యాదుల స్వీకరణ కోసం సీ విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రాజీవ్ కుమార్ తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com